ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

ప్రభాత వార్త

శుక్రవారం 11, సెప్టెంబర్ 2026 16 పేజీలు





మరమ్మతులు చేసినా ఫలితం శూన్యం

# అపర భగీరథుల.. అడ్రసెక్కడ!?

సీతారామా కాలువల్లో "అవినీతి పారుదల"

మళ్ళీ కొట్టుకుపోతున్నాయి

రూ.70కోట్ల పనుల నాణ్యత ప్రశ్నార్థకం

డ్యాం సేఫ్టీ వాళ్ళు నిద్రపోతున్నారా

పనికిమాలిన పనులపై తీసుకున్న చర్యలేమిటి

నిబంధనలకు విరుద్ధంగా నీళ్ళొదిలిన అధికారి ఎవరు

ఉక్కిరి బిక్కిరి అవుతున్న ఇరిగేషన్

గోదావరి నుంచి నీరు లిఫ్ట్ చేసింది ఒక పంపు మాత్రమే

దాని సామర్థ్యం 1589 క్యుసెక్కులు

మరి కాలువలో 1700 ఎక్కడినుంచి వచ్చాయి

లోడెక్కువైతే కెనాల్స్ ఇలా కొట్టుకుపోతాయా

ఈ వాదన చట్టం ముందు నిలబడుతుందా

కాంట్రాక్టర్లే ఇంజనీర్ల కొంపముంచారా

అప్రదిష్టపాలవుతున్న నీటిపారుదల విభాగం

అశ్వారావుపేట /జూలూరుపాడు/ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రచారం చేసుకునే సీతారామాలిఫ్ట్ ఇరిగేషన్ కాలువల్లో అవినీతి వరద పోటెత్తుతున్నది. ఖమ్మం జిల్లావైపు వెళ్ళే రాజీవ్‌లింక్ కెనాల్ ఆర్‌సిసి సైడ్ లెయింగ్ గత ఆగష్టు నెల మధ్యలో ధ్వంసమైన విషయం తెలిసిందే. ఏన్కూరు, జూలూరుపాడు మండలాల పరిధిలో ఇది బయటపడింది. కేవలం మొదటి విడత నీటి విడుదల కే కాలువల నాణ్యత బయటి ప్రపంచానికి తెలిసిపోయింది. కాలువల అంచులు ప్రవాహ వేగానికి చిన్నాభిన్న మయ్యాయి. దీంతో అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సోకాల్డ్ అపరభగీరధులంతా సైలెంట్ ఐపోయారు. నీటిపారుదల విభాగానికి ఏం చేయాలో.., సమాజానికి ఏం చెప్పాలో వారికి అంతుపట్టలేదు. పోతే పోయింది..మరమ్మతులు చేసేస్తా మంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. కొట్టుకుపోయిన చోట్ల తిరిగి ప్యాచ్ వర్క్ చేశామనిపించి చేతులు దులుపుకు న్నారు. ఇది పూర్తయ్యేదాకా కాలువల్లో నీటి విడుదలని తాత్కాలికంగా ఆపారు. ఎన్నాళ్ళాపుతారు పాపం వాళ్ళయినా.. మరమ్మతులు అయ్యాక ఎలాగూ మళ్ళీ నీళ్ళు పారించాలి కదా. మంగళవారం రాత్రి నుంచీ ఈ లింక్ కాలువల గుండా డిస్చార్జ్ మొదలయింది. ఇంకేముంది మళ్ళీ అదే చోట్ల కాంక్రీట్ లెయింగ్ కొట్టుకు పోయింది. రూ.70కోట్ల అంచనాలతో అత్యవసరంగా పనులు అయిపోవాలనే ఆతృతతో చేసే వాటిల్లో నాణ్యత ఎందుకుంటుంది. ఉండదు కాక ఉండదు. ఎప్పుడు నీరు వదిలినా ఇలానే కొట్టుకుపోతాయి. పోతూనే ఉంటాయి. ఇదంతా నిరంతర ప్రక్రియ. కాలువలన్నాక నీళ్ళు వదలాలి. వదిలితే ఇదిగో ఇలా విధ్వంసం. పాపం ఇరిగేషన్ వారు కూడా ఏం చేస్తారు. అటు ప్రభుత్వానికీ.,ఇటు కాంట్రాక్టర్లకు.,ప్రజలకు సమాధానం చెప్పుకోలేక నానా తంటాలు పడుతున్నారు.

### ముఖ్యమంత్రి ఆదేశాలు ఏమైనట్లు

అసలు ఇందులో ఏం జరిగిందో తక్షణం నిపుణుల కమిటీతో ఖచ్చితమైన అధ్యయనం జరిపి.,ఆ నివేదికను సమర్పించాలని.,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని.,పాడయిన చోట్ల మరమ్మతులు చేపట్టాలని.,స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆమధ్యన ఆదేశించారు. అయినా ఆ ఆదేశాలు ఏమయ్యాయో.,మరమ్మతులు చేసినా మళ్ళీ కాలువలు ఎందుకు నాశనమవుతున్నాయో దీనిపై సమీక్ష జరుపుతున్నారా లేదా అనేది తెలియడంలేదు. పైగా ఇక్కడే మరొక ఆసక్తికర పర్యవసానాన్ని ఇంతకుముందే చెప్పాం. అదేమంటే ఈనెల 12 న సిఎం రేవంత్‌రెడ్డి ఆన్‌గోయింగ్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల పురోగతిమీద హైద్రాబాద్‌లో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఇందులో రేవంత్ మాట్లాడుతూ "జాతీయ డ్యాం సేఫ్టీ నిపుణుల మార్గదర్శకాలను తప్పకుండా

2వ పేజీలో...

# ఖమ్మంలో దారుణం

## భార్యను చంపి, శవాన్ని కారులో ఉంచి పార్కింగ్

## పోలీసులు అదుపులో నిందితుడు

ఖమ్మం అర్బన్, సెప్టెంబర్ 10(ప్రభాతవార్త )



2లో...

ఖమ్మం నగరంలో దారుణ ఘటన వెలుగు చూసంది. ఓ వ్యక్తి తన భార్యను గొంతు నులిమి చంపి, కారులోనే ఆమె మృతదేహాన్ని తీసుకుని, ఓ చోట కారును పార్క్ చేసి, ఘటనను స్నేహితునికి ఫోన్ ద్వారా సమాచారం అందించిన ఉదంతం తీవ్ర కలకలం రేపింది.పోలీసు వర్గాల కథనం ప్రకారం వివరాల్లోకి వెడితే.. ఇల్లెందుకు చెందిన మేడిపల్లి విద్యాసాగర్ (44) అనే వ్యక్తి కారు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా మొదటి భార్యతో విడాకులు తీసుకుని, ఆ తర్వాత తనకు పరిచయమైన చిన్నబోయిన రేణుక అనే మహిళను నాలుగు నెలల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ఖమ్మంలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఏరియాలోనే రేణుకతో కలిసి నివాసముంటున్నాడు. భార్య రేణుకకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానం వవిద్యాసాగర్ ది:9 సెప్టెంబర్ సాయంత్రం వేళ తన రెండో భార్య రేణుకను తన కారులో ఎక్కించుకుని బయటకు తీసుకువెళ్లాడు. కారులో ప్రయాణిస్తున్న సమయంలోనే ఇరువురి

16 లో..

# ఎమ్మెల్యే పీఏల సిత్రాలు.. సూడతరమా!



అంతా సార్ కు తెలిసేజరిగిందా..?

వందల మంది బాధితులు క్యాంప్‌ఆఫీస్ చుట్టూ చక్కర్లు..

అయినా నిమ్మకు నీరెత్తినట్లు ఎమ్మెల్యే వ్యవహార తీరు.

పిఏ అరెస్టు వ్యవహారంలో పోలీసుల వ్యూహం ఏంటి.?

భద్రాచలంలో భారీ బెట్టింగ్ దందాలు నడుస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నట్లు.?

బాధితుల నుంచి వసూలు చేసిందంతా బెట్టింగ్లో పోగొట్టాడంటూ డీఎస్పీ స్టేట్మెంట్, రికవరీ మాత్రం నిల్

కొర్ల కళ్యాణ్ కుమార్ వసూలు చేసిన 10 కోట్లలో ఎవరి వాటా ఎంత..?

బాధితులకు న్యాయం చేసేది ఎవరు.?

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త : ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పీఏ ల తీరు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు తీవ్ర సంచల నమైంది. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ముగ్గురు అధికార, అనధికార పీఏ లు గా చలామణి అవుతూ.. అక్రమ దందాకు యదేచ్చగా తెర లేపారు. గత కొంతకాలంగా ఇసుక కాంట్రాక్టుల పేరుతో.. కాంట్రాక్టర్ల నుంచి ప్రైవేట్ వ్యక్తుల నుంచి అందిన కాడికి దండుకుంటూ వచ్చిన ఎమ్మెల్యే ప్రైవేట్, ప్రభుత్వం నియమించిన పిఏ ల వ్యవహారం ఆ ప్రాంతంలో తీవ్ర సంచలనగా మారింది. ఎమ్మెల్యే చెప్పారంటూ అధికారులపై తీవ్ర ఒత్తిడి తేవడం ఇసుకరాంపుల పేరుతో వసూళ్లకు పాల్పడడం గత కొంతకాలంగా భద్రాచలం పినపాక చర్ల మణుగూరు ప్రాంతాల్లో తీవ్ర వివాదాస్పదం అవుతూ వస్తుంది ఈ నేపథ్యంలో గతంలో సదరు ప్రైవేట్ పీఏ కి కొందరు దేహశుద్ధి చేసి పోలీసు కేసు సైతం పెట్టినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఎమ్మెల్యే మెడకు చుట్టుకుంటుంది అనగా తనను కొంతకాలం దూరం పెట్టానని చెప్పుకోవడం ఎమ్మెల్యే వంతైంది.

పీఏల అక్రమ వసూళ్ల దందా వెనుక అసలు సూత్రధారులు ఎవరు.?

ఉద్యోగాలు, ఇసుక కాంట్రాక్టుల పేర్లతో అమాయకులకు కోట్ల రూపాయల కుచ్చుటోపి



## అపర భగీరధుల అడ్రసెక్కడ !?

మొదటి పేజీ తరువాయి..

మంత్రిత్వశాఖా అప్రమత్తమై పరిస్థితిని సమీక్షిస్తున్నారట. దేశ స్థాయిలో ఇది చర్చనీయాంశమయ్యాక., ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ మెగా లిఫ్ట్ ద్వారా గరిష్ఠంగా 7 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టు స్థిరీకరణకు నిద్రాహారాలు మాని ఆకాంక్షిస్తున్న పరిస్థితుల్లో ఇలాంటి అప్రదిష్ట ఎదురైతే అంత తేలిగా తీసుకోరు. కానీ విచారణ జరపడం తదనుగుణ కఠిన చర్యలు చేపట్టడం ఇవేమీ జరిగిన దాఖలాలు కనిపించడంలేదు. ముఖ్యమంత్రి చెప్పినట్లుగా అసలు "డ్యాం సేఫ్టీ" వాళ్ళెక్కడున్నారో అంతా అగమ్యగోచరం. ఈ ప్రాజెక్ట్ అంతా ఆషామాషీ వ్యవహారంతో కూడుకున్నది కాదు. జాతీయ ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ తో ముడిపడి ఉన్నది. ఇంత అధ్వాన్నంగా కాలువల నిర్మాణ నాణ్యత ఉందంటే మరి ఆ ఎన్విరాన్‌మెంట్ ఎందుకు మౌనంగా ఉంటున్నదో అదీ నిగ్గుతేల్చాలని ఆయకట్టు రైతులే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ నాశనానికి గల కారణాలను "ప్రాజెక్ట్స్ ఎస్ఈ" పేరుతో "గూగుల్లో" పొందుపరచిన విధానం చాలా హాస్యాస్పదంగా ఉన్నదనే విమర్శలకు సమాధానం లేదు. దాని సారాంశమేమంటే., " కాలువ సామర్థ్యం కేవలం 1400 క్యుసెక్కులు కాగా.,తమ శాఖ వారు పొరపాటున 1700 క్యుసెక్కుల నీటిని విడుదల చేశారు. అందువల్ల అదనంగా వచ్చిన 300 క్యుసెక్కుల అడిషినల్ లోడ్ కాలువల సైడ్ కాంక్రీట్ లెయింగ్‌ని తుడిచిపెట్టేసింది." ఇదీ సంగతి. ఇలాంటి పొంతనలేని స్టేట్‌మెంట్ ఒకటి అప్‌లోడ్ అయింది. మరి నిజంగా దీనికి స్టేట్ ఇరిగేషన్ వారు బాధ్యులా కాదా.,అసలీ స్టేట్ మెంట్‌తో వారికి సంబంధం ఉందా లేదా అనేది మాత్రం ఖచ్చితంగా చెప్పలేమంటూ ప్రభాతవార్త ఇదివరకే వ్యాఖ్యానించింది. కానీ ఇప్పటిదాకా ఎవరూ నోరు మెదపలేదు. అంటే దీన్ని వాళ్ళు అంగీకరించినట్లే. ఎందుకంటే., మొన్న పదిరోజుల పాటు గోదావరి లిఫ్ట్ పాయిం ట్ వద్ద నీటిని తీసుకున్నది కేవలం ఒక పంపు మాత్రమే. 25 మెగావాట్ల ఈ పంప్ లిఫ్ట్ కెపా సిటీ కేవలం 1589 క్యుసెక్కులు. మరి రాజీవ్ లింక్ కెనాల్లోకి 1700 ఎక్కడినుంచి పుట్టుకొ చ్చాయో ఆ ఇంజనీర్లే వివరించి చెప్పాలి. అక్కడసలు లిఫ్టింగ్ స్కోపే లేనప్పుడు ఇదెలా సాధ్యం. సరే కాసేపు నిజమే అనుకుందాం., 1400 మాత్రమే వదలాల్సిన కాలువలోకి 1700 అనుమతించిన అధికారి ఎవరు ? ఆయన అంత నిర్లక్ష్యంగా ఎందుకున్నారు ? సదరు అధికారిపై ఏదేని శాఖాపర చర్యలకు నిర్ణయం తీసుకున్నారా ? తీసుకున్నట్లయితే అసలు వాటి వివరాలేమిటి ? 1400 క్యుసెక్కులు విడుదల చేయాల్సి ఉండగా.,1700 రిలీజ్ చేశామని మీరే ఆ సైట్‌లో చెప్పినట్లు నమోదయింది. కాబట్టి ఆ తప్పుని మీరే చేశామని చెప్పకనే చెప్పారా లేదా? మరి ఇంత సింపుల్‌గా ఓ మౌఖిక వాంగ్మూలం ఇచ్చేసి తప్పించుకోడానికి ఇదేమీ చిన్నపిల్లల ఆట కాదుకదా ? వేల కోట్ల రూపాయల ప్రజాధనం. అంతకుమించి రాష్ట్ర ప్రభుత్వాల కలల సౌధాలు. సంఘటన బయటపడి 48 గంటలు గడిచింది కదా ఎవరిమీదైనా చర్యలకు ఉపక్రమించారా ? ఈ ప్రశ్నలకు ఎవ్వరూ సమాధానం చెప్పరు. నాల్గురోజులైతే అంతా మరచిపోతారులే అనే ధీమాతో వ్యవహరిస్తున్నారా ? ఈ పప్పులు డక్కపోవచ్చు. నాణ్యతా లోపాలు నేరుగా ప్రజల్లోకి వెళ్ళిపోయాయి. ఇప్పుడు వాళ్ళే నిలదీస్తున్నారు. కాంట్రాక్టర్ల రాజకీయ బలం ముందు ఇరిగేషన్ ఇంజనీర్లు తలదించుకోక తప్పని స్థితివల్లే ఈరోజున ఈ కాలువల నాణ్యత గోదాట్లో కలిసిందనే విమర్శలు తీవ్రమవు తున్నాయి. వాళ్ళ రాజకీయ శక్తియుక్తులముందర ఇంజనీర్ల పర్యవేక్షణ సాగడంలేదని, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం అవడంవల్లనే ఈ దుస్థితి ఎదురైందనే ఆరోపణలూ పుట్టుకొస్తున్నాయి.

### ఈ వాంగ్మూలానికి చట్టబద్ధత లేదు

ఇప్పుడేదైతే ఇంజనీర్లు చెప్పారంటూ గూగుల్లో రికార్డయిందో ఈ స్టేట్‌మెంట్‌కి ఏవిధమైన చట్టబద్ధత ఉండదని నిపుణులు చెబుతున్నారు. పొరబాటున కాలువల్లోకి అదనపు నీటిని వదిలేశామని, అందుకే లెయింగ్ నాశనమైందని చెప్పేసి ఊరుకుంటే కుదరదని ఇక్కడే ఇంజనీర్లు నిలువునా ఇరుక్కుపోయారని అంటున్నారు. రేపొద్దున్న దీనిపై ఏదేని చట్టబద్ధమైన విచారణా కమీషన్ నియమించబడితే., ఫోరెన్సిక్ ఇంజనీరింగ్ ఎక్స్‌పర్ట్ కమిటీ ముందర ఇలాంటి వాదనలే చేస్తే అది క్షమించరానిదిగానూ.,అదే పాయింట్‌మీద సంబంధిత ఇంజనీర్లను ప్రాసిక్యూట్ చేసేలానూ పరిస్థితులు దారితీస్తాయని వారు వివరిస్తూ., ఇది అవినీతి.,నాణ్యతాలేమి కిందకి వస్తుందని బల్లగుద్ది మరీ చెబుతున్నారు.

## ఖమ్మంలో దారుణం..

మొదటి పేజీ తరువాయి..

మధ్య ఘర్షణ ప్రారంభమైంది. ఈ పరిణామాల్లోనే విద్యాసాగర్ రేణుక గొంతు నులిమి చంపేశాడు.తాను తన భార్యను చంపినట్లు విద్యాసాగర్ ఇల్లెందులోని తన స్నేహితునికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. తాను కూడా చనిపోతున్నట్లు తెలిపాడు. దీంతో విద్యాసాగర్ స్నేహితుడు కలవరపడి రఘునాథపాలెం సీఐకి ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో సీఐ అప్రమత్తమై విద్యాసాగర్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతని ఆచూకీని కనిపెట్టారు. గత రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఖమ్మంఇల్లెందు రోడ్డులోని ప్రగతి స్కూల్ దగ్గర విద్యాసాగర్ ఉన్నట్లు గ్రహించారు.విద్యాసాగర్ ఫోన్ నెంబర్ కు పోలీసులు రింగ్ చేసి, ప్రగతి స్కూల్ పక్కనే నిలిపి ఉంచిన ఓ కారు సమీపాన అతను ఉన్నట్లు గ్రహించి వెంటనే అదుపులోకి తీసుకున్నారు. విద్యాసాగర్ గొంతు నులిమి చంపిన అతని భార్య రేణుక మృతదేహం గల కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నిందితుడు ఖమ్మం అర్బన్ పోలీసుల అదుపులో నిందితుడు.నిందితుడు వినియోగించిన కారు రెనాల్ట్ కంపెనీ క్విడ్ గా గుర్తించారు పోలీసులు కాని దాని రిజిస్ట్రేషన్ నెంబర్ ఓనర్ యొక్క పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.అయితే రేణుకను విద్యాసాగర్ ఎక్కడ చంపాడు.చంపిన తర్వాత ఆమె మృతదేహంతో ఎక్కడి నుంచి ఖమ్మం వరకు ఎంత దూరం ప్రయాణించాడు. వంటి అనేక ప్రశ్నలపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

## సత్తుపల్లికి రానున్న సీఎం రేవంత్‌రెడ్డి

### నర్సింగ్ కాలేజ్, పామాయిల్ ఫ్యాక్టరీ, ప్రారంభానికి

### సీఎం ని ఆహ్వానించిన ఎమ్మెల్యే

**సత్తుపల్లి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**



నియోజకవర్గ కేంద్రమైన సత్తుపల్లి లో 25 కోట్ల రూపాయల అంచనాతో నూతనంగా నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాలను, ఏంసూర్ మండలం కల్లూరు గూడెంలో 115 కు కోట్ల రూపాయల అధునాతన టెక్నాలజీతో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డిని రావలసిందిగా ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ ఆహ్వానించారు. అసెంబ్లీలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాంబర్లో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సత్తుపల్లిలో పైన తెలిపిన పలుఅభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభానికి నవంబర్ నెలలోరావాల్సిందిగా ఆహ్వానిం చడంతో ముఖ్యమంత్రి సుముకత వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ తెలిపారు. అనంతరం సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు ప్రజాపాలనను మరింత బలోపేతం చేసే దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. వెయ్యి రోజుల పాలన, నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమా లు వేగవంతం చేయడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సత్తుపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. ప్రజా సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, సమన్వయంతో, ముందుకు సాగుతున్నామని ఈ సందర్భంగా సీఎంకు ఎమ్మెల్యే తెలియజేశారు.

# పోషణ సేవలను బలోపేతం చేయడంలో కుటుంబాలు, సమాజం చురుకైన భాగస్వామ్యం కావాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**పోషణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి కార్యక్రమాలను విజయవంతం చేయాలి**

**మన అంగన్వాడీ - మన బాధ్యత' నినాదంతో నెల రోజుల పాటు పోషణ అవగాహన కార్యక్రమాలు**

**సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు జాతీయ పోషణ మాసం**

**జాతీయ పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం కలెక్టరేట్ సెప్టెంబర్10: (ప్రభాతవార్త)

జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8, 2026 వరకు నెల రోజుల పాటు జాతీయ పోషణ మాసం కార్యక్రమాలను ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. గురువారం మహిళా,శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోషణ మాసం ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మన అంగన్వాడీ - మన బాధ్యత కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ పోషణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని తెలిపారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, మహిళలకు మెరుగైన పోషకాహారం అందించడంతో పాటు పోషణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జాతీయ పోషణ మాసం సందర్భంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోషణ సేవలను బలోపేతం చేయడంలో కుటుంబాలు, సమాజం చురుకైన భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషణ సేవలు, సమతుల్య ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.మన అంగన్వాడీ - మన బాధ్యత' నినాదం తో ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని ప్రజలకు చేరువ చేస్తూ, పోషణ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు, మహిళా సంఘాలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వామ్యం పెంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.జాతీయ పోషణ మాసం సందర్భం గా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పోషణ, ఆరోగ్యం, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కార్యక్రమాల వివరాలను సమగ్రంగా నమోదు చేసి విజయవంతంగా అమలు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, జిల్లా పంచాయతీ అధికారి వినోద్ కుమార్, సెర్ప్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, పోషణ అభియాన్ డీసీ కె. బాబు, డీపీఏ శ్రీనివాస్, ఈవో, హబ్ కో ఆర్డినేటర్ సమీర్, తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ప్రశాంతంగా, భద్రతతో నిర్వహించాలి

**పోలీస్ కమిషనర్**

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త

గణేష్ నవరాత్రుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ.. సహకరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. రానున్న గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ మండపాల నిర్వాహకులతో నగరంలోని సూర్య తేజ ఫంక్షన్ హాల్ లో పోలీసు అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించి, ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సిన భద్రతా నిబంధనలు, పోలీసు శాఖ సూచనలు, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.. ఖమ్మం మున్నేరు నదిలో ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయంగా అనువైన ఖమ్మం అర్బన్ మండలంలోని దంసలాపురం గ్రామపంచాయతీ లోని కొత్తూరు చెరువులో కొనసాగుతున్న నేపథ్యంలో మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనకు సహకరించాలి అన్నారు. అదేవిదంగా గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ పోర్టల్ policeportal.tspolice.gov.inలో రిజిస్టర్ అయి మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా మండపాల ఏర్పాటు, విగ్రహాల ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలు, ఊరేగింపులు, నిమజ్జనం తదితర కార్యక్రమాలను ముందస్తు ప్రణాళి కతో నిర్వహించే అవకాశం ఉంటుందని అన్నారు. డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో ప్రభుత్వ నిబంధ నలు తప్పనిసరిగా పాటించాలని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని నిర్వాహకులకు సూచించారు. రాత్రి వేళల్లో శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాలు నిర్వహించకుండా నిబంధనలను పాటించాలని తెలిపారు.గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్ణయించిన మార్గాలు, సమయాలను పాటించాలని, ఊరేగింపులో పాల్గొనే వారు క్రమశిక్షణ పాటించేలా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు.నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్ ప్రమాదాలు, నీట మునిగే ప్రమాదాలు తదితర ఘటనలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులు, ఈత రాని వారు నీటిలోకి వెళ్లకుండా నిర్వాహకులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని తెలిపారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించడంలో మండపాల నిర్వాహకుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి, సమస్య లేదా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ గణేష్ నవరాత్రుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని పోలీసు అధికారులు కోరారు.గణేష్ మండపాల నిర్వాహకులకు సూచనలు 1) గణేష్ విగ్రహాల ఏర్పాటుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నిర్వాహకుల పేర్లు మరియు సంప్రదింపు నంబర్లు పొందుపర్చాలి.2) విగ్రహం ఏర్పాటు స్థలం ప్రైవేట్ వ్యక్తికి చెందినదైతే, సంబంధిత వ్యక్తుల నుండి ఎటువంటి అభ్యంతర లేదని ధృవీకరణ పత్రం పొందాలి.3) నిర్వాహకులు "విగ్రహాలను రహదారిలో కాని వివాదాస్పద స్థలాల్లో ప్రతిష్టించవద్దని విజ్ఞప్తి.4) ప్రధాన రహదారులపై, ట్రాఫిక్ రద్దీగా వుండే రహదారులపై విగ్రహాలను ఏర్పాటు చేయరాదు.5) విద్యుత్ షార్ట్ సర్క్యూట్ నివారించేందుకు.నాణ్యమైన విద్యుత్ తీగలు మరియు పరికరాలు గణేష్ పందల వద్దఉపయోగించాలి.6) మండపాల వద్ద దీరి లకు అనుమతి ఇవ్వబడదు,రెండు మైక్ తో కూడిన స్పీకర్లు(ధ్వని పరిమాణం తప్పనిసరిగా నాన్ డిస్టబెన్స్ లెవెల్‌లో ఉండాలి) మాత్రమే అనుమతించబడతాయి.అదేవిధంగా ఉదయం 6.00 నుండి రాత్రి 10.00 వరకు సమయాలను అనుసరించి మైక్ సౌండ్ సిస్టమ్ వినియోగించాలి. 7) గణేష్ మండపాల వద్ద అసభ్యకరమైన నృత్యాలు, కార్యక్రమాలు చేపట్టకూడదు.8) ప్రతి గణేష్ మండపంలో ఇద్దరు సభ్యులు 24 గంటలు ఉండేలా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి.

# టిఫిన్ సెంటర్ నిర్వాహకులపై దాడి...

**టేకులపల్లి ప్రభాతవార్త:**

టేకులపల్లి. పోస్ట్ ఆఫీస్ సెంటర్లోని టిఫిన్ సెంటర్లో కూల్ డ్రింక్స్, సిగరెట్లు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వమని అడిగినందుకు దంపతులపై ఒక వ్యక్తి తీవ్రస్థాయిలో దాడికి పాల్పడ్డాడు. బాధిత దంపతులు తోటకూరి జయంత్ కుమార్, గౌతమి తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి బోడ సురేష్ (తండ్రి: సక్రం) అనే వ్యక్తి వారి వ్యాపార స్థలానికి వచ్చి వస్తువులు కొనుగోలు చేశాడు. గౌతమి అతనిని బిల్లు చెల్లించమని కోరగా, సురేష్ ఆగ్రహంతో ఊగిపోతూ దంపతులిద్దరిపై దురుసుగా ప్రవర్తించాడు. గౌతమి గల్లా పట్టుకుని లాగి దాడి చేయడమే కాకుండా, మహిళ అని కూడా చూడకుండా అత్యంత అసభ్యకరమైన పదజాలంతో దూషించాడు. అడ్డువచ్చిన జయంత్ కుమార్ గల్లా పట్టుకుని గుండెపై పిడిగుద్దులు కురిపించి, రోడ్డుపై పడేసి భౌతిక దాడికి దిగాడు. దాడి అనంతరం సురేష్ "ఎవరిని పిలుస్తావో పిలువు.. నాకు అందరూ తెలుసు అంటూ బెదిరింపులు దిగాడు బహిరంగంగా ప్రాణ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన బాధితులు గురువారం రాత్రి టేకులపల్లి ఎస్ఐ కే. తిరుపతికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బోడ సురేష్ నుంచి తమకు తీవ్ర ప్రాణహాని ఉందని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిందితుడిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే భవిష్యత్తులో తమకు ఎలాంటి హాని తలపెట్టకుండా తగిన రక్షణ కల్పించాలని పోలీసులను విజ్ఞప్తి చేశారు.

## కోడిపందాల స్థావరాలపై పోలీసులు , టాస్క్‌ఫోర్స్ సంయుక్త దాడులు

**14 ద్విచక్ర వాహనాలు, రూ.41,820 నగదు స్వాధీనం**

**అదుపులో ఆరుగురు వ్యక్తులు**

**అశ్వాపురం,ప్రభాతవార్త, సెప్టెంబర్ 10:**

అశ్వాపురం మండలంలోని మొండికుంట అటవీ ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరాలపై విశ్వసనీయ సమాచారం మేరకు అశ్వాపురం పోలీస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ




దాడుల్లో 14 ద్విచక్ర వాహనాలు, రూ. 41,820 నగదును తోపాటు ఎనిమిది కోళ్లను స్వాధీనం చేసుకున్నారు . కోడిపందాలు ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు అక్కడి నుండి పరారయ్యారు. కోడిపందాల నిర్వహణకు ఒక ఆర్గనైజర్ ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తుంది. స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న ఆరుగురిపై తదుపరి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ అధికారులతో పాటు అశ్వాపురం ఎస్సై రాజేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్లు ఎప్పుడు ఇస్తారు సారూ..?

**పాత పింఛన్లు పెంచేదెప్పుడు సర్కారు...?**

**కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ**

**పింఛన్ల మంజూరు పై స్పష్టత కరువు**

**లబ్ధిదారుల దరి చేరని చేయూత..!**

**సర్టిఫికెట్ల కోసం బారులు తీరుతున్న లబ్ధిదారులు**

**నిత్యవసర ధరలు పెంపు, పింఛన్లు మాత్రం పెంచరా..!**

**పేద ప్రజల మదిలో మెదులుతున్న ప్రశ్న..!**

**అశ్వాపురం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 10**

ప్రభుత్వం అందించే సామాజిక భద్రతా పింఛన్ల కోసం అర్హులైన ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హత కలిగిన పేదలు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకుని నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా, మంజూరు ఎప్పుడు జరుగుతుందో తెలియక ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు. ప్రస్తుతం కొత్త పింఛన్లకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అర్హులైన వారిని త్వరితగతిన గుర్తించి పింఛన్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అనేకమంది మా దరఖాస్తు ఎప్పుడు పరిశీలిస్తారు, మాకు పింఛన్ ఎప్పుడు వస్తుంది అంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లుగా ఎదురుచూపులకు మాత్రమే పరిమితమయ్యామని, తమకు ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని నూతన దరఖాస్తు దారులు, పాత పింఛన్ల మొత్తాన్ని పెంచాలని గత కొంతకాలంగా పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు కోరుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, నిరుపేద కుటుంబాలు పింఛన్ మొత్తంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న పరిస్థితి ఉంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయలు, విద్యుత్, వైద్యం, రవాణా తదితర ఖర్చులు పేద ప్రజలకు సామాన్యులకు అందనంత దూరంలో పెరుగుతుంటే మాకు మాత్రం పింఛన్లు పెంచలేదని, అదే పింఛన్ మొత్తంతో నెలవారీ అవసరాలను తీర్చుకోవడం కష్టంగా మారిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు చుక్కలనంటుతుంటే మా పింఛన్ మాత్రం పెరగదా అని ప్రశ్నిస్తున్నారు. మార్కెట్లో ప్రతి వస్తువు ధర పెరుగుతోందని, మందుల ఖర్చులు పెరిగాయని, ఇంటి అవసరాలు పెరిగాయని, కానీ పింఛన్ మాత్రం అదే మొత్తంలో ఉంటే ఎలా జీవించాలని వృద్ధులు ప్రశ్నిస్తున్నారు. పేద, వృద్ధ, దివ్యాంగ లబ్ధిదారులకు పింఛన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా వారి రోజువారీ జీవనానికి ప్రధాన ఆధారంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ధరలకు అనుగుణంగా పాత పింఛన్లను పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసే లబ్ధిదారులు దరఖాస్తులు తీసుకుంటున్నారు కానీ మంజూరు పై స్పష్టత కొరవడింది అంటున్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం కొత్తగా పింఛన్ల కోసం అర్హులైన ప్రజలు దరఖాస్తులు చేసుకుంటున్నారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ అర్హులైన వారికి పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారన్న అంశంపై స్పష్టత




కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్ అందక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ప్రకటన కోసం ఆశగా కొత్త పింఛన్ల మంజూరుతో పాటు పాత పింఛన్ల పెంపుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పింఛన్ పెంపు ఎప్పటి నుంచి అమలు చేస్తారు, కొత్త పింఛన్లు ఎప్పటి నుంచి అందిస్తారు, దరఖాస్తుల పరిశీలన ఎప్పుడు పూర్తవుతుంది, అనే ప్రశ్నలకు పాలకులు సమాధానం చెప్పాలని ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా ఎదురుచూపులకు తెరదించి, అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో పాటు, పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకుని పాత పింఛన్లను పెంచాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మొత్తంగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఎదురుచూపులు, పాత పింఛన్ల పెంపుపై నెలకొన్న ఆశలు ఎప్పుడు నెరవేరుతాయో వేచి చూడాలి.




### ఇద్దరు చిన్నారులు మృతి

**దుమ్ముగూడెం :ప్రభాత వార్త (సెప్టెంబర్ 10)**

మండల పరిధిలోని గౌరవరం కే లక్ష్మీ ప్రపురం గ్రామాలకు చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందడం దుమ్ముగూడెం మండలంలో కలకలం రేగింది గౌరవరం గ్రామానికి చెందిన మూడు నెలల చిన్నారి అనారోగ్యంకు గురవడంతో పాప తల్లిదండ్రులు బుధవారం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్ళి చికిత్సలు చేయించారు. కాగా పాప ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందింది అలాగే కే లక్ష్మీ ప్రపురం గ్రామానికి చెందిన నాలుగు నెలల పాపకు చిన్న బండిరేవు గ్రామంలో నున్న పర్ణశాల పి హెచ్ సిలో వ్యాక్సినేషన్ చేయించారు వ్యాక్సినేషన్ అనంతరం పాప తల్లి చిన్న బండి రేవు గ్రామంలో తన తల్లిదండ్రుల ఇంటి వద్దకు వెళ్లి అక్కడే ఉంది ఈ క్రమంలో బుధవారం రాత్రి పాప మృతి చెందింది ఇద్దరు చిన్నారులు మృతి చెందడం మండలంలో కలకలం రేగింది ఈ చిన్నారుల మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

### ఘనంగా ఐలమ్మ వర్ధంతి

**. అశ్వాపురం,ప్రభాతవార్త, సెప్టెంబర్ 10:**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని అశ్వాపురం మండలం మొండికుంట గ్రామపంచాయతీలో గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మర్రి సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మర్రి సంధ్య మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆమె చూపిన తెగువ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నైజాం నవాబు దుర్మార్గాలకు ఎదురొడ్డి నిలిచిన ఆమె ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక అన్యాయాన్ని ఎదురించి, పేదల హక్కుల కోసం పోరాడిన చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆమె సూచించారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ సాగించిన పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారి వెంకన్న, రాసమల్ల ఎల్లయ్య, చిన్నారి ఉప్పలమ్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.

### కుటుంబ కలహాలతో యువకుడి బలవన్మరణం

**భద్రాచలం క్రైమ్, ప్రభాతవార్త:**



కుటుంబ కలహాలు ఓ యువకుడి జీవితాన్ని విషాదాంతం చేశాయి. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా నెలకొన్న విభేదాలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన భద్రాచలం పట్టణంలోని జగదీష్ కాలనీలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జగదీష్ కాలనీకి చెందిన అనుబోజు ప్రభాకర్ (28)కు భార్య, ఓ పాప ఉన్నారు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి. దీంతో సుమారు ఏడాది కాలంగా ఇద్దరూ వేర్వేరుగా ఉంటున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో కుటుంబ పరిస్థితులపై తీవ్ర మనస్తాపానికి గురైన ప్రభాకర్ గురువారం సాయంత్రం తాను నివాసం ఉంటున్న ఇంటిలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై భద్రాచలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఈ నిర్ణయానికి పాల్పడటం స్థానికంగా విషాదాన్ని నింపింది. భార్య, చిన్నారి ఉన్న కుటుంబంలో చోటుచేసుకున్న ఈ ఘటన పలువురిని కలచివేసింది.

## గోపాల్ పేటలో ఐలమ్మ 40 వర్ధంతి వేడుకలు

**తల్లాడ సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**

మండల పరిధిలోని గోపాల్పేటలో ఐద్వా ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 41 వర్ధంతి వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా ఐద్వా డివిజన్ నాయకురాలు పెరసానిలత మాట్లాడుతూ దోపిడీకి వ్యతిరేకంగా ఎర్ర జెండా పట్టుకొని పోరాడిన గొప్ప నాయకురాలని ఐలమ్మను కొనియాడారు ఈ కార్యక్రమంలో దొడ్డపనేని నారాయణమ్మ ఎల్లంకి లక్ష్మి గార్లపాటి యశోద చెరుకుపల్లి జ్యోతి ఆల స్వంం విజయ కాంపల్లి లక్ష్మి కూచి



పూడి కవిత తదితరులు పాల్గొన్నారు




## ప్రైవేట్ విద్యార్థులతో పోటీకి 'సై' ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యకు ప్రాధాన్యం

**భద్రాచలం, సెప్టెంబరు 10(ప్రభాతవార్త):**



ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీ పడేందుకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం సిద్ధంగా ఉన్నారని భద్రాచలం మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు అన్నారు. గురువారం భద్రాచలం పట్టణంలోని శిల్పినగర్ ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థి కేంద్రంగా బోధన సాగిస్తూ, ఉపాధ్యాయులు వివిధ శిక్షణ కార్యక్రమాల్లో పొందిన నైపుణ్యాలను తరగతి గదుల్లో సమర్థంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుల సమగ్ర బోధనతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, ఏ పోటీకైనా తాము సిద్ధమనే భావన కలుగుతోందన్నారు. పాఠశాలల్లో వసతులు, పచ్చదనం, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన నిర్వహణతో పాటు ఎఫ్ఎల్ఎన్, రెమిడీయల్ తరగతులు, బేస్‌లైన్ పరీక్షలు సంతృప్తికరంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్, 6, 7 తరగతుల విద్యార్థులకు లిప్ కార్యక్రమంలో భాగంగా బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి, అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల రిసోర్స్ పర్సన్ టి. రామకృష్ణ, ప్రధానోపాధ్యాయిని కృష్ణకుమారి, ఉపాధ్యాయిని స్రవంతి, స్వచ్ఛమిత్ర సేవకురాలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసరాల ధరలు తగ్గించాలి

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 10)**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై మోయలేని భారాన్ని వేస్తూ నిత్యావసర సరుకుల ధరలు పెంచారని వెంటనే నిత్యావసరాల ధరలు తగ్గించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథ నాయకులు సాయన్న వీరభద్రం డిమాండ్ చేశారు దుమ్ముగూడెం మండలం ములకపాడు గ్రామం వద్ద ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు ఈనెల 11వ తేదీన కొత్తగూడెంలో జరిగే మహా ధర్నాకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు భద్రాచలం నుండి వెంకటాపురం వరకు శిథిలావస్థకు చేరిన రహదారిని నూతనంగా నిర్మించాలని ఇసుక లారీ లా డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజన చట్టాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మిడియం ముదరాజు కొరస రాంశెట్టి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకురాలు చింతకాయల సరళ కొమరం బాబు కొమరం వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు




# ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

**భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా వీరోచిత పోరాటం**

**సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్**

**భద్రాచలం, ప్రభాతవార్త:**

భూస్వామ్య, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు, బలహీన వర్గాల ప్రజల పక్షాన అలుపెరగని పోరాటం చేసిన వీరవనిత చిట్యాల ఐలమ్మ అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక చందద్రావు భవన్‌లో వర్ధంతి సభ నిర్వహించారు. పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ఐలమ్మ చిత్రపటానికి ఏజే రమేష్, ఎంబీ నర్సా రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏజే రమేష్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో



ఐలమ్మ మహిళలను సమీకరించి, తుపాకి చేతబట్టి భూస్వాములు, పెత్తందారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. పీడిత ప్రజలను ఐక్యం చేసి సుదీర్ఘకాలం పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగానే పేదలకు లక్షల ఎకరాల భూమి దక్కిందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కొందరు మతోన్మాద శక్తులు వక్రీకరించి ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. పేదలు, భూస్వాముల మధ్య జరిగిన పోరాటాన్ని మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఐలమ్మ, దొడ్డి కొమురయ్య వంటి అనేక మంది కమ్యూనిస్టు నాయకులు తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఐలమ్మ స్ఫూర్తితో నేటి పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మించాలని ఏజే రమేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్‌బాబు, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు సంతోష్‌కుమార్, సీనియర్ నాయకులు ఎంవీ ప్రసాదరావు, ఎంవీఎస్ నారాయణ, ఐద్వా నాయకురాలు సుబ్బలక్ష్మి ✓ పాల్గొన్నారు.

# ఆటుపోట్లను తట్టుకుని నిలిచినవారే నిజమైన కమ్యూనిస్టులు

**టీవీఆర్ చంద్రం జీవితం**

**నేటితరానికి స్ఫూర్తిదాయకం**

**ఘనంగా 'ఎగరేసిన ఎర్రజెండా'**

**పుస్తకావిష్కరణ**

**భద్రాచలం, ప్రభాతవార్త:**

పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి, ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా చివరి వరకు ఎర్రజెండాను వీడకుండా నిలిచినవారే నిజమైన కమ్యూనిస్టులని వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. భద్రాచలంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో గురువారం అమరజీవి టీవీఆర్ చంద్రం జీవిత చరిత్ర ఆధారంగా ఆయన కుమారుడు జగన్ రచించిన 'ఎగరేసిన ఎర్రజెండా' పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీల చీలిక అనంతరం టీవీఆర్ చంద్రం సీపీఐ(ఎం) పక్షాన నిబద్ధతతో నిలిచారని గుర్తు చేశారు. భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ తొలి శాఖ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా చివరి వరకు ఎర్రజెండాను వీడలేదన్నారు. అమరవీరులు, ఉద్యమ నాయకుల జీవిత చరిత్రలను పుస్తకాల రూపంలో నేటితరానికి



అందించడం అభినందనీయమన్నారు.

**అమరవీరుల చరిత్ర దాచేస్తే దాగదు**

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్ మాట్లాడుతూ.. ఆదివాసీలు, బడుగు, బలహీన వర్గాల కోసం జీవితాలను, ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల చరిత్రను దాచేస్తే దాగదన్నారు. భద్రాచలం నియోజకవర్గంలో బండారు చందద్రావు, టీవీఆర్ చంద్రం, ఎలమంచి సీతారామయ్య, బీఎస్ రామయ్యలు పార్టీ నిర్మాణానికి నాలుగు స్తంభాలుగా నిలిచారని పేర్కొన్నారు. అమరవీరుల స్ఫూర్తితో మతోన్మాద, సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**త్యాగమే కమ్యూనిస్టుల జీవితానికి చిరునామా**

సీపీఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు అంటేనే త్యాగానికి ప్రతిరూపమన్నారు. పార్టీ సిద్ధాంతాలు, నిర్ణయాలకు కట్టుబడి టీవీఆర్ చంద్రం నిస్వార్థ జీవితాన్ని గడిపారని తెలిపారు. అందుకే ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. వ్యక్తిగత ఆస్తులు కూడబెట్టకపోయినా పార్టీ కోసం నిలిచిన కార్యకర్తలే టీవీఆర్ చంద్రం సంపాదించిన వెలకట్టలేని ఆస్తి అని పేర్కొన్నారు.

**భద్రాచలం అభివృద్ధిలో వామపక్షాల పాత్ర కీలకం**

సీపీఐ జిల్లా కార్యదర్శి షబ్బీర్ పాషా మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గ అభివృద్ధిలో కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. టీవీఆర్ చంద్రం నియోజకవర్గంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. వామపక్షాలు ఐక్యంగా పోరాడి ఎన్నో విజయాలు సాధించాయని, అమరవీరుల స్ఫూర్తితో వామపక్ష ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఎలమంచి రవికుమార్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు చిటూరు వెంకట్రావు మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల కోసం కమ్యూనిస్టు నాయకులు చేసిన త్యాగాలు మరువలేనివని అన్నారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకులు సింగు నరసింహారావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్, పోటు రంగారావు, ముర రమేష్, ఎంబీ నర్సా రెడ్డి, కొలగాని బ్రహ్మాచారి, కారం పుల్లయ్య, గడ్డం స్వామి తదితర నాయకులు, టీవీఆర్ చంద్రం కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు సీమంతం, అన్నప్రసన వేడుకలు

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:**

పౌష్టికాహారం తోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు ఉంటుందని సర్పంచ్ భానోత్ నరసింహ అన్నారు. మండల పరిధిలోని అంజనాపురం గ్రామంలో గురువారం సీమంతం, అన్నప్రసన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ బానోత్ నరసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలలో ప్రత్యేకంగా గర్భిణీలకు చిన్న పిల్లలకు బలవర్ధకమైన పౌష్టిక ఆహారం అందిస్తున్నారని గర్భిణీలు చిన్నపిల్లలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన ఉండాలని అన్నారు. గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవడంతో పాటు ప్రొటీన్లు,



విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో తప్పనిసరిగా టీకాలు వేయించుకోవడంతో పాటు పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని పేర్కొంటూ, గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ స్వరాజ్యం, ఏఎన్ఎం, అంగన్వాడీ సిబ్బంది, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

# వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకం

## జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జ్యోతి



ఖమ్మం కలెక్టరేట్ సెప్టెంబర్10: (ప్రభాతవార్త)

వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకమని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి అన్నారు. స్థానిక వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద గురువారం జిల్లా వెనక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి మాట్లాడుతూ సమాజంలోని అసమానత్వానికి ఎదురొడ్డి నిర్భయంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, జమీందార్ల పాలనలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా అనేక సంఘాలలో ఆమె స్ఫూర్తి నింపారని అన్నారు. చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలిగా, భూ, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారి వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. చాకలి ఐలమ్మ కు గుర్తింపు అందించడంలో భాగంగా కోఠిలోని మహిళ యూనివర్సిటీకి ప్రభుత్వం చాకలి ఐలమ్మ పేరు పెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ సొసైటీ చైర్మన్ ఎలగొండ స్వామి, రజక కులసంఘ నాయకులు, బిసి కుల సంఘ నాయకులు జక్కుల వెంకటరమణ, తమ్మరపు బ్రహ్మం, మాచర్ల యెలాద్రి, కోడి లింగయ్య, నట్టు వెంకటేశ్వర్లు, కత్తి నెహ్రూగౌడ్, మునిగ కోటేశ్వరరావు, ఎల్లురి విజయ్ కుమార్, ఎస్ కే సయ్యద్ బాషా, వల్లపు సోమరాజు, అప్పారావు, ఉపేందర్, పడిగల కృష్ణవేణి, రమాదేవి, బాబురావు, సత్యనారాయణ, హనుమంతు రావు, వెంకన్న, రమణ కుమార్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారులు, ఖమ్మం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయం సిబ్బంది, వసతిగృహ సంక్షేమ అధికారులు, రజక సంఘ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన నాయకుడు కేసీఆర్

## ప్రజా సమస్యలపై ప్రశ్నించే బీఆర్ఎస్ సభ్యులపై సస్పెన్షన్ సరికాదు

## మాజీ ఎంపీ నామ..

ఖమ్మం టౌన్,ప్రభాతవార్త,సెప్టెంబర్ 10:

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు అలుపెరగని పోరాటం చేసి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి పునాది వేసిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను, బీఆర్ఎస్ సభ్యులపై సస్పెన్షన్‌ను బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఒక ప్రజాప్రతినిధి బహిరంగంగా ఒక రాజకీయ నాయకుడి మరణాన్ని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. కేసీఆర్‌పై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇదే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాలు సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలకు, హింసను ప్రేరేపించే విధమైన వ్యాఖ్యలకు ఎలాంటి స్థానం లేదన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు తమ మాటల ద్వారా సమాజానికి బాధ్యతాయుతమైన సందేశాన్ని ఇవ్వాల్సి ఉంటుందని నామ పేర్కొన్నారు. ముఖ్యంగా ఒక ప్రతిపక్ష నేతపై బహిరంగంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రజల్లో ఆందోళన కలిగించడంతో పాటు శాంతిభద్రతలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను పోలీసులు తీవ్రంగా పరిగణించి, పూర్తి స్థాయిలో విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని నామ డిమాండ్ చేశారు. ఆ ప్రజా ప్రతినిధి చేసిన వ్యాఖ్యల వెనుక ఎవరైనా ప్రేరేపించారా, సహకరించారా లేదా ఇతరుల ప్రమేయం ఉందా అనే అంశాలను కూడా విచారించాలన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు, సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో భాగమేనని, అయితే వ్యక్తిగతంగా దూషించడం, మరణాన్ని కోరుకోవడం వంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధమని నామ స్పష్టం చేశారు. కేసీఆర్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి హాని కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నామ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్ సరికాదు : ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశం లేకుండా బీఆర్ఎస్ శాసనసభ్యులను ఈ సెషన్ ముగిసే వరకు శాసనసభ నుంచి సస్పెండ్ చేయడం సరికాదని నామ తెలియజేశారు. ప్రజలు ఎన్నుకుని శాసనసభకు పంపిన సభ్యులకు తమ నియోజకవర్గాల సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రతిపక్ష సభ్యులు తమ అభిప్రాయాలను, ప్రజల ఇబ్బందులను ప్రస్తావించే విధంగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో శాసనసభను నిర్వహించాలని కాని ముఖ్యమైన అంశాలపై మాట్లాడే అవకాశం లేకుండా సభ్యులను సస్పెండ్ చేయడం వల్ల ప్రజలకు సంబంధించిన సమస్యలపై సమగ్ర చర్చ జరగకుండా పోతుందని తెలిపారు.

# బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దళిత వ్యతిరేక చర్యలను అరికట్టాలి

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల్లు నూతి సత్యనారాయణ గౌడ్

## నేడు అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ, పాలాభిషేకం

## జిల్లా కాంగ్రెస్ పిలుపు



ఖమ్మం సెప్టెంబర్ 10, ప్రభాత వార్త:

బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దళిత వ్యతిరేక చర్యలను అరికట్టాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మాట్లాడుతూ .. ఉత్తరాఖండ్ లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ప్రదేశాన్ని బీజేపీ, మనువాద నాయకులు శుద్ధి చేసిన దాష్టీకం మరువక ముందే, అసెంబ్లీ ప్రారంభం రోజున బీఆర్ఎస్ పార్టీ శాసనమండలి సభ్యుడు తాతా మధు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, అనంతరం ఎర్రవల్లిలో దళిత నాయకులు నిరసన తెలిపిన రోడ్లను బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దారుణమన్నారు. ఈ దళిత వ్యతిరేక చర్యలను నిరసిస్తూ నేటి ఉదయం 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి జెడ్పీ సెంటర్ లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, మొక్క శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, విప్లవ కుమార్, తూములూరి లక్ష్మీ నరసింహారావు, మూడుముంతల గంగరాజు యాదవ్, కొట్టే రాజశేఖర్, దామా స్వరూప తదితరులు పాల్గొన్నారు.




# వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం టౌన్,ప్రభాతవార్త,సెప్టెంబర్ 10 :



ఖమ్మం నగరంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని దంసలాపురం చెరువు వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం ఉదయం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అదనపు కలెక్టర్ , పోలీస్ శాఖ అధికారులు, ఎమ్మార్వో, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, విశిదీదిలి అధికారులతో కలిసి చెరువు పరిసర ప్రాంతాల్లో నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. వినాయక విగ్రహాలతో వచ్చే వాహనాల రాకపోకలకు అనువుగా మార్గాల పరిస్థితి, వాహనాలు వచ్చే మరియు తిరిగి వెళ్లే మార్గాల్లో ఎలాంటి ఇబ్బందులు లేదా అడ్డంకులు లేకుండా చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్ తదితర ఏర్పాట్లపై అధికారులు చర్చించారు. నిమజ్జన కార్యక్రమానికి వచ్చే ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు.

# బీసీ మహిళలకు వంద శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు

## దరఖాస్తుల ఆహ్వానం

## బిసి అభివృద్ధి అధికారిణి జ్యోతి

ఖమ్మం కలెక్టరేట్ సెప్టెంబర్ 10: (ప్రభాతవార్త)

బీసీ మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం ప్రారంభించి, వందశాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే మహిళలు ఖమ్మం జిల్లాకు చెందిన బీసీ వర్గానికి చెందిన మహిళలై ఉండాలని, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. నిరుద్యోగ మహిళలు, నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథ మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలకు మించకూ డదని, తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కుట్టు వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి, అలాగే కనీస ప్రాథమిక అక్షరాస్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను tgobmms.cgg.gov.in పోర్టల్ ద్వారా సమర్పించాలని తెలిపారు. అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా సంబంధిత ధృవీకరణ పత్రాలతో గ్రామీణ ప్రాంతవాసులు మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ వాసులు మునిసిపల్ కమీషనర్ లకు దర ఖాస్తులు సమర్పించాలని బిసి అభివృద్ధి అధికారి జ్యోతి ఆ ప్రకటనలో కోరారు.

# అన్నం ఫౌండేషన్ లో వైద్య శిబిరం

ఖమ్మం అర్బన్ సెప్టెంబర్ 10( ప్ర బాత వార్త

ఖమ్మం నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్లో ఉన్న అనాధులకు గురువారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆదేశంతో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామారావు సారథ్యంలో మంచుకొండ వైద్యశాల నుండి డాక్టర్ మద్దినేని పూజ సమక్షంలోవైద్య సిబ్బంది అన్నం ఫౌండేషన్ లోని 45 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేసి కొందరికి మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అన్నం ఫౌండేషన్ గౌరవ కలెక్టర్ కి, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.




# కొత్తగూడెంలో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

### పాల్గొన్న కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

జిల్లా ప్రజలకు ఆధార్ సేవలు మరింత చేరువ చేసేందుకు కొత్తగూడెం పాత మెయిన్ హాస్పిటల్ ప్రాంతంలో నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం ప్రారంభించారు. కేంద్రంలో కొత్త ఆధార్ నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పు, మొబైల్ నంబర్ అనుసంధానం తదితర సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. రోజుకు 300-400 మందికి సేవలు అందించే సామర్థం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో



ముందస్తు టోకెన్ బుకింగ్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆధార్ సేవల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి న అవసరం లేకుండా కొత్తగూడెంలోనే సేవలు పొందే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో యూఐడిఏఐ, బిఎల్ఎస్ అధికారులు, తహసీల్దార్ పుల్లయ్య, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు, టీఎస్‌టీఎస్ జిల్లా మేనేజర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశానికి సెప్టెంబర్ 30 వరకు గడువు పెంపు

**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మొదటి సంవత్సరము ప్రవేశానికి ఈనెల సెప్టెంబర్ 30 వరకు గడువు పెంచినట్లు శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల( అటానమస్) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి పద్మ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరము, ఓపెన్ ఇంటర్, డిప్లమా, ఐటిఐ పూర్తి చేసిన వారు మొదటి సంవత్సరానికి అడ్మిషన్ పొందవచ్చు అని తెలియజేశారు కొయ్య చెంచు దివ్యాంగులకు ఎటువంటి ఫీజు ఉండదని ఒక ప్రకటనలో తెలియజేశారు అదేవిధంగా ద్వితీయ సంవత్సరము తృతీయ సంవత్సరము చదువుతున్న విద్యార్థులు యూనివర్సిటీ ఫీజులు ఈ నెల 30 వరకు చెల్లించాలి అని వివరించారు

## గణేష్ మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి: డీఎస్పీ

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**



గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీస్, మున్సిపల్ శాఖల నిబంధనలు తప్పక పాటించాలని డీఎస్పీ ఆదినారాయణ సూచించారు. మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకుండా చూడాలని తెలిపారు. మండపాల వద్ద అగ్నిమాపక పరికరాలు, సురక్షి త విద్యుత్ ఏర్పాట్లు, అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగం నిషేధమని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. విరాళాలను బలవంతంగా వసూలు చేయరాదని, మద్యం, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. నిమజ్జన సమయంలో అధికారులు సూచించిన మార్గాలు, కేంద్రాలను మాత్రమే వినియోగించి పోలీసులకు సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 100, ఫైర్ 101, అంబులెన్స్ 108కు సంప్రదించాలని సూచించారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం: సాబీర్ పాషా

**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ, విసునూరు దేశ్‌ముఖ్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎర్రజెండా అండతో ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. నేటికీ పేదల భూ సమస్యలు పరిష్కారం కాకపోవడం బాధాకరమని, ఐలమ్మ స్ఫూర్తితో హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇంద్రాల మురళి, రాచర్ల వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ: కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

భూమి, భుక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ మహిళా శక్తికి, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచారని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం, త్యాగం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత, మహిళలు ఆమె పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాలని పిలుపుని చ్చారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్వో పద్మావతి, బీసీ అధికారి విజయలక్ష్మి ్మ, ఎస్సీ అధికారి శ్రీలత, బీసీ సంఘాల నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

## భూ రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: కలెక్టర్

**కొత్తగూడెం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

భూ రీసర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డుల్లోని వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. చంద్రుగొండ మండలం సీతాయిగూడెంలో జరుగుతున్న రీ సర్వే పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పరిధిలో 1,823 ఎకరాలకు రీసర్వే చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. పాత రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించిన కలెక్టర్.. భూ హద్దులను స్పష్టంగా గుర్తించి శాశ్వత హద్దు గుర్తులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం గిరిజన రైతులతో మాట్లాడిన కలెక్టర్ రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను



తెలుసుకున్నారు. భూమి ఉండి పాస్‌బుక్‌లు లేని వారు, రికార్డుల్లో వివరాలు నమోదు కాని సమస్యలను గుర్తించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్కరి భూ వివరాలు రికార్డుల్లో తప్పిపోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, సర్వే, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఫ్రీ మెడికల్ క్యాంప్‌కు భారీ స్పందన



**కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ రైతర్భస్తి గొల్లగూడెంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఉచిత వైద్య పరీక్షల శిబిరానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది. భౌగోళిక, ఆర్థిక కారణాల వల్ల సాధారణ ఆరోగ్య సేవలకు దూరంగా ఉంటున్న ప్రజల వద్దకే నాణ్యమైన వైద్యాన్ని చేర్చాలనే సంకల్పంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన స్థానిక కార్పొరేటర్ జల్లి శ్రీలక్షి ్మ మాట్లాడుతూ... మధుమేహం (డయాబెటిస్), రక్తపోటు (హైపర్ టెన్షన్) వంటి జీవనశైలి వ్యాధులను ముందస్తుగా గుర్తించి నివారించడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అధిక రక్తపోటు, షుగర్ స్థాయిలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సాధారణ జీవనశైలి మార్పులతోనే నయం చేయవచ్చని, తీవ్రమైన సమస్యలు ఉన్నవారిని ఉన్నత వైద్యం కోసం అర్బన్ హెల్త్ సెంటర్ (యుహెచ్ సి)కు రెఫర్ చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఇదే సందర్భంలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ఖిఆయుష్మాన్ భారత్ఖి (పీఎంజేఏవై) పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. పేద, బలహీన కుటుంబాలకు సంవత్సరానికి రూ. 5 లక్షల వరకు ఉచిత నగదు రహిత వైద్య బీమాను అందించే ఈ ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ నివాస ప్రాంతంలోనే ఉచితంగా వైద్య సేవలు అందించినందుకు స్థానిక ప్రజలు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎ. కరుణేశ్వరి, ఏఎన్ఎం భవాని, ఆశా వర్కర్ దేవి, ఆర్పీలు ప్రభ, గౌతమిలతో పాటు డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పెండింగ్ కేసుల పరిష్కారంలో ప్రతిభ

### సిఐ ఇంద్రసేనారెడ్డిని ఎస్పీ అభినందన

**కొత్తగూడెం క్రైమ్ , ప్రభాతవార్త,**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహిస్తూ కేసుల పురోగతిలో ప్రతిభ కనబరిచిన కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ఇంద్రసేనారెడ్డిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఇచ్చిన ఆదేశాల మేరకు, త్రీ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తన పరిధిలోని దర్యాప్తులో ఉన్న కేసులను క్షుణ్ణంగా పరిశీలించి, సాక్ష్యాధారాలను సేకరించి, నిందితులను గుర్తించడంలో కీలక పాత్ర పోషించారు. కేసు దర్యాప్తులో ఆయన చూపిన చొరవ, నిబద్ధత పట్ల ఎస్పీ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సీఐ ఇంద్రసేనారెడ్డిని ఎస్పీ రోహిత్ రాజు అభినందిస్తూ.. ఇదే స్ఫూర్తితో మిగిలిన కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించి బాధితు లకు న్యాయం చేయాలని సూచించా ్. పోలీస్ శాఖలో ఇలాంటి సమర్థవంతమైన పనితీరు ఇతర సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తు ందని పేర్కొన్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల్లో పురోగతి సాధించడం వల్ల నేర నియం త్రణతో పాటు ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం మరింత పెరుగుతుందని ఎస్పీ అన్నారు.

## ప్రెస్ క్లబ్ కోశాధికారిగా సత్యనారాయణ



**ఖమ్మం, ప్రభాత వార్త :**

ఖమ్మం ప్రెస్ క్లబ్ కోశాధికారిగా సీనియర్ జర్నలిస్ట్ పిన్ని సత్యనారా యణ(మన తెలంగాణ) ఎన్నికైనట్లు టియూడ బ్ల్యూజె (ఐజెయూ ) ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శీలం శ్రీనివాస్ తెలిపారు. గురువారం జరిగిన కమిటీ ప్రత్యేక సమావే శంలో ఈ ఎన్నిక జరిగినట్లు తెలిపారు. ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు కమిటీ పని చేస్తున్నట్లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ గా సత్యనారాయణ అందరికీ సుపరిచితులని తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.

# భూ రీసర్వేతో ప్రతి భూమికి డిజిటల్ మ్యాప్

### .రైతుల సమక్షంలో పారదర్శకంగా హద్దుల నిర్ధారణ : రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం. కలెక్టర్ దివాకర టీఎస్

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 10: ప్రభాతవార్త

. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే ద్వారా భూముల విస్తీర్ణంలో తేడాలు, రికార్డుల్లోని లోపాలు, హద్దుల వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ఎర్రుపాలెం మండలంలోని తాటిగూడెం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. పంట పొలాల్లో నడుచుకుంటూ వెళ్లిన కలెక్టర్ రైతుల సమక్షంలో అధికారులు నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడి సర్వే తీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక యంత్రాల సహాయంతో చేపడుతున్న భూ రీసర్వే ద్వారా ప్రతి రైతు భూమికి డిజిటల్ మ్యాప్‌తో కూడిన భూధార్ కార్డు అందుతుందని తెలిపారు. గతంలో కొంతమంది రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు లేకపోవడం, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి తేడాలు ఉండడం





వంటి సమస్యలు ఉన్నాయని చెప్పారు. కొందరి భూమి తక్కువగా, మరికొందరి భూమి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీసర్వే ద్వారా ఇలాంటి లోపాలను గుర్తించి సరిచేస్తామని స్పష్టం చేశారు. రీసర్వేకు సంబంధించి రైతులకు 48 గంటల ముందుగానే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. రైతుల సమక్షంలోనే భూములను కొలుస్తామని, రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపించడంతో పాటు పక్క భూముల రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. సర్వేకు నోటీసులు అందుకున్న రైతులు, వారి కుటుంబంలోని భూ హక్కుదారులు, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు ఉన్నవారు తప్పనిసరిగా హాజరై పూర్తి వివరాలు అందించి అధికారులకు సహకరించాలని కోరారు. సర్వే పూర్తయిన వెంటనే భూమి విస్తీర్ణ వివరాలను రైతులకు అక్కడికక్కడే తెలియజేస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులకు ఏమైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసిన తర్వాతే తుది వివరాలను నిర్ధారిస్తామని, అవసరమైతే రైతుల సమ్మతితో భూమి విస్తీర్ణానికి సంబంధించిన సంతకాలు కూడా తీసుకుంటామని చెప్పారు. మొత్తం రీసర్వే ప్రక్రియ భూ హక్కుదారుల సమక్షంలోనే పారదర్శకంగా జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. రీసర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులపై ప్రదర్శిస్తామని తెలిపారు. అభ్యంతరాలకు నిర్దిష్ట గడువు కల్పించి, వాటిని స్వీకరించి పరిష్కరించిన అనంతరం తుది భూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రీసర్వే పూర్తయితే భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు భూమిపై మరింత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె. సునీతా ఎలిజబెత్, సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ వెన్నపూస కృష్ణారెడ్డి, ఆర్ ఐ రవికుమార్, సర్వేయర్ రాజశేఖర్, జీపీవో లు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు,రవి, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, కర్నాటి సుధాకర్ రెడ్డి, గౌర్రాజు రాములు, కూడెల్లి నాగేశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## కలెక్టర్ ను కలిసిన సిపిఎం పార్టీ బృందం,

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 10. ప్రభాతవార్త.



ఎరుపాలెం మండల పరిధిలోని తాటిగూడెం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీ సర్వే ను ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పరిశీలించడానికి వచ్చిన సందర్భంలో సిపిఎం పార్టీ బృందం కలెక్టర్ ను కలిసి భూ సర్వే గురించి అనేక విషయాలు తెలుసుకున్నారు. మండ్నలలో గల రైతుల వ్యవసాయ భూములు వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని సాగర్ జలాలను విడుదల చేయాలని వినతిపత్రం అందించారు. మండలంలో విచ్చలవిడిగా అక్రమ మైనింగ్ యదేచ్ఛగా మట్టి మాఫియా రవాణా చేస్తున్నారని అట్టి మట్టి మాఫియా ఆగడాలను అరికట్టాలని కలెక్టర్ ను కోరారు. వీటి పైన స్పందించిన కలెక్టర్ సాగర్ జలాలను రెండవ జోన్ కి నీటిని విడుదల చేశామని మండలం మూడవ జోన్ లో ఉందని నీటిని విడుదల చేస్తామని చెప్పారని,మట్టి మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని తహసిల్దార్ సునీత ఎలిజిబెత్ ను ఆదేశించినట్లు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య,మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కూడెల్లి నాగేశ్వరరావు, గౌర్రాజు రాములు, తాళ్లూరు వెంకటనారాయణ వేముల వెంకటేశ్వరరావు, వీరంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మధిర, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

కేంద్ర మాజీ మంత్రి రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి ద్వారా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసుతో మంజూరైన రూ 65 500 ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మధిరలోని శ్రీమతి రేణుకా చౌదరి క్యాంప్ కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జవ్వాజి ఆనందరావు ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ..మూడు చెక్కులను.. పంపిణీ చేశారు. సిరిపురం గ్రామానికి చెందిన ఎదురు పద్మావతి రూ.23 వేలు ఇల్లూరు కు చెందిన మడి వెంకన్న రూ.27 వేలు కొండల అర్చన రూ.16వేల చెక్కులను జవ్వాజి ఆనందరావు పంపిణీ చేశారు. సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించినందుకు ..తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి , రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు లబ్ధిదారులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్లపూడి అప్పారావు, అవ్వల గురుబ్రహ్మం, జల్లేపల్లి ప్రసాద్, బాదా సత్యనారాయణ రెడ్డి తదితరులున్నారు్ద

## లాలి మృతదేహానికి నివాళులు

కామేపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :

నెమలిపురి తండా లో కాంగ్రెస్ నాయకులు భూక్య నాగేశ్వరావు మాతృమూర్తి లాలి (56) అనారోగ్య కారణాలతో మృతి చెందారు.ఆమె మృతదేహాన్ని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గింజల నరసింహారెడ్డి,మాజీ ఎంపిటిసి సభ్యులు,కాంగ్రెస్ నాయకులు రామ్ రెడ్డి జగన్నాధ రెడ్డి గురువారం సందర్శించి నివాళులర్పిం చారు. రామ్ రెడ్డి జగన్నాథ్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం ద్వారా వచ్చే బెనిఫిట్స్ ను అధికారులతో మాట్లాడి అదేవిధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూక్య బలరాం నాయక్, మాజీ సర్పంచ్ భూక్య విజయ మోహన్, నాయకులు సురేష్ , సపావట్ పర్షియా నాయక్, సపవట్ వస్రం నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ సర్వే తో రైతుల భూములకు పారదర్శక హద్దులు

### తొండల గోపవరం లో "భూ రీ సర్వే "ను పరిశీలించిన కలెక్టర్

మధిర సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే తో గ్రామాల పరిధిలో రైతుల భూములకు పారదర్శక హద్దులను నిర్దేశించడం జరుగుతుందని స్పష్టమైన హక్కులను నిర్దేశించే అవకాశం కలుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. భూ సర్వే లో భాగంగా మధిర మండలంలో ఎంపిక చేసిన తొండల గోపవరం గ్రామంలో కొనసాగుతున్న సర్వేను ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. సందర్భంగా రైతులు గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ ఈ భూ సర్వే ద్వారా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతులకు సంబంధించిన భూమి



హద్దులను శాటిలైట్ చిత్రాల ద్వారా ఆన్లైన్ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పూర్తి పారదర్శకతతో కూడిన ఈ సర్వే వలన రైతు లకు భవిష్యత్తులో ఎటువంటి భూమి సంబంధిత సమస్యలు తలెత్తవని ఆయన పేర్కొన్నారు. పారదర్శకతతో కూడిన హక్కు పత్రాలకు సంబంధించి ఎక్కడి నుండైనా ఆన్లైన్లో చూసుకోవచ్చునని ఆయన తెలిపారు. మండలంలో మధిర మండలంలో ఎంపిక చేసిన సిద్ధినేని గూడెం తోర్లపాడు నాగవరప్పాడు నక్కలగరువు తొండల గోపవరం గ్రామాలలో భూముల రిసర్వేను చేపట్టడం జరుగుతున్నదని ఆయన తెలిపారు. వంద రోజుల పరిధిలో ఈ ఐదు గ్రామాలలో ఉన్న సర్వే నెంబర్లు ఆధారంగా బౌండరీలను నిర్దేశించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం తొండల గోపవరం గ్రామంలో ఈ భూ సర్వే కొనసాగుతున్నదని ఇప్పటివరకు గ్రామంలోని భూములకు సంబంధించి సరిహద్దును నిర్దేశించడం జరిగిందని ఆయన తెలిపారు. గ్రామంలో నిర్దేశించిన సర్వే కు గ్రామంలోని రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయనకోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాళ్ల బండి రాంబాబు ఆర్ఐ భాను ప్రసాద్ సర్వేయర్ జిపిఓ ఇతర సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఖాళీగా ఉన్న టీచర్ వార్డెన్ పోస్ట్ లను భర్తీ చేయాలి

మధిర సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

మధిర నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వసతి గృహాల వార్డెన్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మధిర మండల మహాస భ లో నూతన మధిర మండల కౌన్సిల్ 30 మంది విద్యార్థిలతో మండల శాఖ ను లక్ష్మణ్ ప్రకటించారు. మధిర మండల అధ్యక్షుడిగా నందిపాటి వెంకటేశ్వర్లు కార్యదర్శిగా కళ్లెం అశోక్ ఉపాధ్యక్షులుగా నందిని, సత్య, హుస్సేన్ , మడుపల్లి గోపి సహాయ కార్యదర్శులు గా కె. అక్షిత ముకేశ్ యశ్వంత్ కోశాధికారిగా




గోపి శ్రీ నాతో పాటు కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని మండల వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ బలోపేతం చేస్తామని వారు అన్నారు. నిర్మాణంలో ఉన్న మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చెయ్యాలని. మండల వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, వార్డెన్ ల పోస్టులు భర్తీ చేయాలనీ మండల కేంద్రంలో శిధిల వ్యవస్థలో ఉన్న గిరిజన బాలుర, బాలికల వసతి గృహాలకు కొత్త భవనాలను మంజూరు చేయాలనీమండలంలోని సిరిపురంలో ఎస్సీ బాలికల హాస్టల్కు కొత్త భవనానికి మంజూరు చేయాలనీ, సిరిపురం జూనియర్ కళాశాలకు, ఐటిఐ కళాశాలకు అనుసంధానంగా బాలుర బాలికల వసతి గృహాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఔట్ సోర్సింగ్ కొలువుల కోసం 'బాబు'కు కప్పం చెల్లించాల్సిందేనా..?

**బ్యాక్ డోర్‌లోనే నియామకాలు**

**అర్హతలు.. నిబంధనలు చెత్తబుట్టలోనే!**

**ఒక్కో ఉద్యోగానికి.. ఒక్కో రేటు?**

**ముందస్తుగా చెల్లిస్తేనే జాబితాలో పేరు..**

**జాప్యం అయితే లిస్ట్‌లో గాయబ్!**

**ఆధారాలతో ఫిర్యాదు చేసేందుకు**

**బాధితులు సిద్ధమవుతున్న సమాచారం..!!**




ఇల్లందు, సెప్టెంబర్10, ప్రభాతవార్త: వైద్య విధాన పరిషత్ పరిధిలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల నియామకాల్లో అక్రమాలకు తెరలేస్తున్నాయా..? అర్హతలు, నిబంధనలు, పారదర్శకతకు తిలోదకాలు ఇస్తూ బ్యాక్ డోర్ నియామకాలకు తెరతీస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగం కావాలంటే ముందుగా "బాబు"కు 'కప్పం' చెల్లించాల్సిందేనన్న ప్రచారం ఉద్యోగార్థుల్లో తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. ఒక్కో ఉద్యోగానికి ఒక్కో రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ప్రస్తుతం వైద్య శాఖ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది ఉద్యోగానికి ముందే డబ్బులు చెల్లించాలని పెడితే అయిపోయింది కదా.

### ఉద్యోగానికి ముందే డబ్బులు..!

ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల భర్తీలో అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, నిబంధనల ప్రకారం ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే కొన్ని నియామకాల్లో ఈ ప్రక్రియకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉద్యోగం ఇప్పిస్తామంటూ కొందరు మధ్యవర్తులు అభ్యర్థులను సంప్రదిస్తున్నారని, ముందుగానే డబ్బులు చెల్లిస్తేనే నియామక జాబితాలో పేరు ఉంటుందని చెబుతున్నారన్న సమాచారం కలకలం రేపుతోంది. డబ్బు చెల్లింపులో జాప్యం జరిగితే మొదట చెప్పిన హామీ మారిపోతుందని, చివరి జాబితాలో పేరు కనిపించకుండా పోతుందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ఉద్యోగం కోసం ఆశగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

### ఒక్కో కొలువుకు.. ఒక్కో రేటు?

వైద్య విధాన పరిషత్ పరిధిలోని వివిధ ఆసుపత్రుల్లో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పోస్టులకు ఒక్కో ఉద్యోగానికి ఒక్కో రేటు నిర్ణయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోస్టు స్వభావం, వేతనం, ఆసుపత్రి, ఉద్యోగానికి ఉన్న డిమాండ్ ఆధారంగా మొత్తాలు మారుతున్నాయని కొందరు ఉద్యోగార్థులు చెబుతున్నట్లు సమాచారం వాస్తవంగా ఎక్కడ, ఎవరి ద్వారా, ఎంత మొత్తంలో డబ్బులు వసూలు చేశారన్న అంశంపై సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు నీకు తేల్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

### వార్త ప్రచురణతో శాఖలో చర్చ..!

వైద్య విధాన పరిషత్‌లో ఉద్యోగాల పేరుతో జరుగుతున్న దందాపై ఇటీవల వెలువడిన కథనం ఆ శాఖలో బాబు తీవ్ర చర్చకు దారితీసినట్లు తెలుస్తోంది. ఉద్యోగ నియామకాల వెనుక అసలు వ్యవహారం ఖిబాబుఖిదే ఏమిటన్న దానిపై అధికారులు, ఉద్యోగార్థులు, సిబ్బంది మధ్య చర్చ జరుగుతుంది. కథనం వెలువడిన అనంతరం ఇప్పటి వరకు జరిగిన నియామక ప్రక్రియపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పోస్టుల భర్తీలో మెరిట్, రోస్టర్, అర్హతలు, ఎంపిక ప్రక్రియను పూర్తిగా పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

### కొలువులకు కప్పం తీసుకుంటున్న బాబుల్లో గుబులు?

ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న వ్యక్తుల్లో గుబులు మొదలైందన్న చర్చ సాగుతోంది. ఇప్పటివరకు మౌనంగా ఉన్న బాధితులు, ఉద్యోగార్థులు తమ వద్ద ఉన్న ఆధారాలతో సహా వెలుగులోకి రానున్నాయి. డబ్బులు చెల్లించినట్లు చెప్పబడుతున్న అభ్యర్థులు తమ వద్ద ఉన్న ఫోన్ సంభాషణలు, చెల్లింపుల వివరాలు, వాట్సాప్ మెసేజ్‌లు, ఇతర ఆధారాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సైతం సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

### రాష్ట్ర అధికారుల దృష్టికి వ్యవహారం..!

వైద్య విధాన పరిషత్‌లో ఉద్యోగాల నియామకాల్లో అక్రమాలపై వస్తున్న ఆరోపణలు రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. నియామక ప్రక్రియలో పారదర్శకతపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది. గతంలో జరిగిన నియామకాలతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ నియామకాలకు సంబంధించిన జాబితాలు, ఎంపిక విధానం, అర్హతలు, రోస్టర్, ఏజెన్సీ పాత్ర, అభ్యర్థుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేశారన్న అంశాలపై విచారణ చేపడితే అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందా?

### ఆధారాలతో ఫిర్యాదులకు సిద్ధమవుతున్న బాధితులు..!

ఉద్యోగం వస్తుందన్న ఆశతో డబ్బులు చెల్లించినట్లు చెబుతున్న కొందరు అభ్యర్థులు అధికారికంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించి, ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదుతో బండారం పడనుంది.

### ఒకే ఆసుపత్రిలో ముగ్గురు 'బొక్కల డాక్టర్ల'పై విమర్శలు

ఇదిలా ఉండగా ఒకే వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు బొక్కల డాక్టర్లు ముగ్గురిలో ఇద్దరు రెగ్యులర్ అయినప్పటికీ ఔట్ సోర్సింగ్ వైద్యుడిని కొనసాగించడంపై ఆరోపణలు వెతుకుతున్నాయి. ఈ వ్యవహారంలోనూ వైద్య విధాన పరిషత్ అధికారుల రూపాయి కారి ఒప్పందాలని గుసగుసలాడుకుంటున్నారు వ్యవహారశైలిపై కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నట్లు సమాచారం. ఆసుపత్రిలో పరిపాలనా వ్యవహారాలు, సిబ్బంది నియామకాలు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సంబంధించిన అంశాల్లో ఖిబాబు ఖిపాత్రపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణలు నిజమా కాదా అన్నది సమగ్ర విచారణలోనే తేలాల్సి ఉంటుంది.

### ఉన్నతాధికారులు స్పందించాలి

ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు నిరుద్యోగులకు ఉపాధి కల్పించే మార్గాలు. అలాంటి ఉద్యోగాల నియామకాల్లో డబ్బులు అకౌంట్ ద్వారా కొన్ని ఫోన్ పే గూగుల్ పే ద్వారా చేతులు మారాయి అన్న సమాచారం. ఆరోపణలు నిజమైతే అది తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. అర్హత, మెరిట్, రోస్టర్, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నియామకాలు జరుగుతున్నాయా లేదా అన్నది వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. ఉద్యోగాల పేరుతో ఒక్క రూపాయి కూడా అక్రమంగా వసూలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగార్థులు కోరుతున్నారు. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



**అదే నిజమైంది**

**మార్కెటింగ్ శాఖ నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం**

**ఏడాది గడచినా పూర్తికాని "మార్కెట్ యార్డ్ నిర్మాణం"**

**అసలు ప్రారంభానికి నోచని "కవర్డ్ షెడ్"**

**గత ఏడాది జూలైలో 3 కోట్లు మంజూరు**

**ఈ సీజన్లో కూడా స్థలం లేక పత్తి కొనుగోళ్లకు కష్టకాలమే**

**మార్కెటింగ్ ఇంజనీరింగ్‌శాఖ దృష్టికి తీసుకెళ్తా... కార్యదర్శి నిర్మల**

# అందరి నోటా "జాప్యం"

**జూలూరుపాడు, ప్రభాతవార్త : గత మూడు దశాబ్దాలకు పైగా జూలూరుపాడు మండల కేంద్రంలో ప్రతి ఏటా పత్తి కొనుగోళ్లు పెద్ద ఎత్తున సాగుతుంటాయి. ఆనాటి నుంచి ఏన్కూరు మార్కెట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో తాత్కాలికంగా జూలూరుపాడులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంటారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే జూలూరుపాడు లోని తాత్కాలిక కొనుగోలు కేంద్రంలో పత్తి కొనుగోళ్లు డిమాండ్ స్థాయిలో జరుగుతుంటాయి. ఏనుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి అనుమతి పొందిన 17 మంది స్థానిక ట్రేడర్లు పత్తి కొనుగోలు చేస్తుండగా, దాదాపు 600 మందికి పైగా హమాలీలు పనిచేస్తుంటారు. ప్రతి ఏటా దసరా పండుగ మొదలు దాదాపు మార్చి నెల వరకు ఆరు నెలల పాటు ఇక్కడ పత్తి కొనుగోళ్లు నిరంతరం సాగుతాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు సరిహద్దు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి రైతులు పండించిన పత్తి పంటను అమ్ముకునేందుకు ఆటోల్లో ఇక్కడి మార్కెట్ కు తీసుకొస్తారు. సీజన్లో ప్రతిరోజు జూలూరుపాడు తాత్కాలిక మార్కెట్ నుంచి సుమారు 15 నుంచి 20 లారీల పత్తి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న జిన్నింగ్ మిల్లులతో పాటు గుజరాత్ రాష్ట్రానికి కూడా వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు.**

తాత్కాలిక మార్కెట్ యార్డులో పెద్ద ఎత్తున పత్తి కొనుగోళ్లు జరుగుతూ ఉండటంతో ప్రత్యేక యార్డు నిర్మాణం కోసం స్థలంతో పాటు, అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని రైతు సంఘాలు, రైతులు కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. స్థానిక ట్రేడర్లు స్వయంగా లీజుకు తీసుకున్న ప్రైవేటు భూముల్లోనే ఏళ్ల తరబడి పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. గత రెండేళ్లుగా పత్తి కొనుగోళ్లకు అవసరమైన ప్రైవేటు స్థలం లీజుకు దొరకకపోవడంతో కొత్త సమస్యలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో కోట్ల రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూరుస్తున్న జూలూరుపాడు తాత్కాలిక మార్కెట్ యార్డును ప్రత్యేకంగా వ్యవసాయ కమిటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో పాటు రైతులు, హమాలీలు, వ్యాపారులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు సైతం ప్రత్యేక మార్కెట్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీలు కూడా ఇచ్చారు. గత రెండేళ్ల క్రితం జూలూరుపాడు రెవెన్యూ పరిధిలో 218 సర్వే నంబర్లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని మార్కెట్ నిర్మాణం కోసం కేటాయించారు. ఆ తర్వాత ఎట్టకేలకు గత ఏడాది జులై నెలలో స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ కృషితో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నుంచి ప్రత్యేకంగా 3 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 90 లక్షలతో భూమి చదును చేయడం, 2 కోట్ల10లక్షలతో కవర్డ్ షెడ్ నిర్మాణం, 3.20 లక్షలతో 2 ఎమ్మెస్ పోర్టబుల్ క్యాబిన్ లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేసింది. పనులను సొంతం చేసుకున్న



కాంట్రాక్టర్ నిర్మాణ పనులను ప్రారంభించడంలో తీవ్ర జాప్యం చేయడంతో దాదాపు మూడు నెలల వరకు పనులు ప్రారంభం కాలేదు. ఎట్టకేలకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చొరవతో ఈ ఏడాది మార్చి నెలలో నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించాడు. కానీ పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా చేశారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఆరు నెలల పాటు 90 లక్షలతో చేయాల్సిన భూమి చదును పనులు కూడా సక్రమంగా చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతోపాటు 2 కోట్ల 10 లక్షలతో నిర్మించాల్సిన కవర్డ్ షెడ్ నిర్మాణం పనులు కనీసం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. గత ఏడాది ప్రభుత్వం 3 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించినా, మార్కెటింగ్ శాఖ ఇంజనీర్ల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం కారణంగా నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. మరో నెల రోజుల్లోనే పత్తి కొనుగోళ్ల సీజన్ ప్రారంభం కానుంది. ఈ సీజన్లో కూడా పత్తి కొనుగోళ్లకు స్థలం లేకపోవడంతో రైతులు, వ్యాపారులు, హమాలీలు ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి తలెత్తింది. మార్కెట్ నిర్మాణ పనులను కొందరు రైతు సంఘం నాయకులు పరిశీలించి, పనులు సక్రమంగా జరగడం లేదని, ఈ పత్తి కొనుగోళ్ల సీజన్ నాటికి పనులు పూర్తికావని ఆరోపణలు చేశారు. చివరకు ఇప్పటిదాకా "అందరూ అనుకున్న మాటలే నిజమయ్యాయి". ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు మార్కెట్ నిర్మాణ పనులపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఏనుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ, మార్కెట్ యార్డ్ నిర్మాణ పనుల్లో జాప్యం విషయాన్ని మార్కెటింగ్ శాఖ జిల్లా ఇంజనీర్ల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

## దమ్మపేట ఎస్టి హాస్టల్‌లో దయనీయ పరిస్థితులు

**నీళ్లు లేక నరకయాతన... సగం మంది విద్యార్థులు ఇళ్ల బాట**

**మూడు రోజులుగా పాఠశాలకు దూరమైన విద్యార్థులు**

**మోటార్ రిపేర్ అయినా పట్టించుకోని అధికారులు..**

**కాలకృత్యాలకు పంచాయతీ నీళ్ళే దిక్కు**

**పై అధికారుల దృష్టికి తీసుకెళ్లా వార్డెన్**

దమ్మపేట రూరల్, ప్రభాతవార్త

ప్రభుత్వాలు నిరుపేద, గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య తో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని గొప్పలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. దమ్మపేట మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కనీసం త్రాగడానికి, స్నానానికి, కాల కృత్యాలకు నీళ్లు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పరిస్థితి ఎంత దయనీయంగా మారింది అంటే హాస్టల్లోని సగం మంది విద్యార్థులు ఇళ్ళకు వెళ్లిపోయారు. హాస్టల్ లో నీటి సరఫరా చేసే మోటార్ మూడు రోజుల క్రితం రిపేరుకు రావడంతో సమస్య మొదలైంది. సాధారణంగా ఇలాంటి చిన్న సమస్యలను గంటలు, లేదా ఒక రోజులో పరిశీలించాల్సి ఉండగా మూడు రోజులు గడుస్తున్న సంబంధిత అధికారులు స్పందించక పోవడం విమర్శలకు తావిస్తోంది. నీటి సమస్యతో విద్యార్థులు దయ నందిన జీవనం అస్తవ్యస్తంగా మారింది.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలి

**ఎస్పీ రోహిత్ రాజు**

కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ లో గురువారం నాడు టెక్ టీమ్ ఆపరేటర్స్, సైబర్ వారియర్స్ కు వివిధ పోలీసింగ్ వెబ్ అప్లికేషన్ల పై ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరై శిక్షణను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0, క్రైమాక్, ఐసీజేఎస్, టీఎస్‌కాప్స్, డయల్100, ఎఫ్ఆర్ఎస్, ఎంటర్‌ప్రైజ్ చెక్, ఈ సాక్ష్య, సైక్యాప్స్, డోపామ్స్, ఎన్‌సీఆర్‌పీ, ఐరాడ్, సమన్వయ పోర్టల్, సీఈఐఆర్, దర్పణ్, సహయోగ్, వాత్సల్య, జిఆర్ఎం, ఎంఆర్ఎఫ్, నాట్ గ్రిడ్, గాండీవ తదితర వెబ్ అప్లికేషన్ల పై సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ



మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ కేసుల దర్యాప్తు, నేరస్థుల గుర్తింపు, సైబర్ నేరాల నియంత్రణ, డిజిటల్ సాక్ష్యాల సేకరణలో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని టెక్ టీమ్ ఆపరేటర్లు, సైబర్ వారియర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటి కోర్ సీఐ రాము, సైబర్ సెల్ సీఐ జితేందర్, సిఐలు రమాకాంత్, లక్ష్మి, పోలీసు అధికారులు, టేక్ టీం ఆపరేటర్స్, సైబర్ వారియర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెంగళరావునగర్ నుండి కిష్టారం వరకు డేంజర్ జన్



**సింగరేణి దుమ్ము ధూళి,తో బురదమయంగా తయారైన రోడ్డు**

**పదుల సంఖ్యలో మృత్యువాత గురైన సంఘటనలు**

సత్తుపల్లి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

సింగరేణి బొగ్గు గనులు ప్రారంభం కన్నా ముందు సింగరేణి ఏరియా ప్రభావిత ప్రాంతాల ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామన్న సింగరేణి యాజమాన్యం మాటలు నేడు వారు అశ్రద్ధ, నిర్లక్ష్యం నిలువుటద్దంగా సత్తుపల్లి పట్టణంలోనివెంగళరావు నగర్ నుంచి కిష్టారం గ్రామం వరకు వెళ్ళు ప్రధాన రహదారి మీద ప్రయాణం ఇందుకు నిదర్శంగా ఉందని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఖమ్మం టూ రాజమండ్రి వెళ్లే ఈ ప్రధాన రహదారి సత్తుపల్లి లోని వెంగళరావునగర్ నుంచి కిష్టారం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల దూరం రహదారి మీద సింగరేణిలో లభ్యం అవుతున్న బొగ్గు ఇతర ప్రాంతాలకు లారీల ద్వారా రవాణా అవుతున్న సందర్భంలో దుమ్ము ధూళి రోడ్డు మీద పడి, అట్టి దుమ్మును తడపటం రోడ్డు మొత్తం బురద మయంగా తయారవడంతో వాహనదారులకు ద్విచక్ర వాహనదారులు ఈ రహదారి మీద ప్రయాణించాలంటే ప్రాణ సంకటంగాతయారయిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కిష్టారం వై జంక్షన్ లారీ యూనియన్ సమీపంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలో పదుల సంఖ్యలో మృత్యువాత గురైన సంఘటనల చాలా ఉన్నాయి. కిష్టారం ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి అయ్యే బొగ్గు లారీల ద్వారా కొత్తగూడెం (రుద్రంపూర్) పలు ప్రాంతాలకు రవాణా అవటంతో ఓపెన్ కాస్ట్ ఎంట్రెన్స్ నుంచి కిష్టారం వై జంక్షన్ వరకు విపరీతమైన దుమ్ము ధూళి రోడ్డు మొత్తం వ్యాపించి ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనం కూడా కనిపించక రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటన లు కోకొల్లలు ఉన్నాయి. దీనికి తోడు అట్టి దుమ్ము, దులిని సింగరేణి వారు ట్యాంకర్ల ద్వారా రోడ్డు తడపడంతో రోడ్డు బురదమయంగా తయారయ్యి ద్విచక్ర వాహనదారులు వేగంగా వెళుతూ రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై లారీలు తిష్ట....అదేవిధంగా ఈ రహదారి ఖమ్మం టు రాజమండ్రి వెళ్లే ప్రధాన రహదారి కావడం వల్ల ప్రతిరోజు బస్సుల, లారీలు, కార్లు ,వందలాది వాహనాలు ఈ రహదారిపై ప్రయాణం చేస్తుంటాయి. ఈ రహదారిపై ఇటు ఖమ్మం వైపు నుంచి రాజమండ్రి, అటు రాజమండ్రి నుంచి ఇటు ఖమ్మం వైపు వచ్చే వందలాది వాహనాలు నిత్యం



ప్రయాణిస్తుండటం వల్ల కిష్టారం సమీప వై జంక్షన్ దగ్గరకు రాగానే లారీలు రోడ్డుకి రెండు వైపులా పగలు, రాత్రి అనే బేధం లేకుండా నిలుపు చేయటం వల్ల ఇక్కడ ప్రమాదాలు తరచూ జరుగుతూ ఉన్నాయని వాహనదారులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి మీద వాహనదారులు గాని ద్విచక్ర వాహనదారులు గాని ప్రయాణించాలంటే భయం గుప్పెట్లో పెట్టుకొని ప్రయాణం చేయవలసిన పరిస్థితి నెలకొందని ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకొని వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, ప్రయాణాలు సులువుగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

**సింగరేణి జిఎం వివరణ....**

సత్తుపల్లి పట్టణం వెంగళరావునగర్ నుంచి కిష్టారం వై జంక్షన్ సమీపం వరకు రహదారి బురద మయం, రోడ్డుకి ఇరువైపులా లారీలు రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వాహన దారుల నుంచి వస్తున్న ఆరోపణలను సత్తుపల్లి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ సరికొండ వెంకటాచారి దృష్టికి గురువారం ప్రభాతవార్త తీసుకెళ్లగా" ఐ కెపాసిటీ సీటింగ్ మిషన్"యంత్రం టెండర్ పూర్తి అయిందని రెండు మూడు నెలల్లో వస్తుందని ఈ పెద్ద మిషన్ పట్టణాల్లో కూడా ఇలాంటి రోడ్లు చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేస్తుంది అని ఈ రోడ్డు కూడా బురదమయం కాకుండా చెత్తాచెదారం ఏమీ లేకుండా శుభ్రం చేస్తుందని తద్వారా ప్రయాణం కూడా సులువుగా ఉంటుందని జిఎం వివరించారు. అలాగే రోడ్డుకి ఇరువైపులా నిలుపుతున్న లారీలను సైతం తీపిస్తామని ఈ సందర్భంగా జిఎం అన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలి

**42 బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా చర్యలు వేగవంతం చేయాలి**

**ఎనిమిది నెలల్లో 349 ప్రమాదాలు 164 మంది మృతి అదనపు కలెక్టర్ వేణుగోపాల్**

కొత్తగూడెం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రమాదాలకు గల కారణాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా విశ్లేషించి, ప్రమాదాల పునరావృతిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అధికారులు, వాహనదారులు, ప్రజలు సమష్టిగా బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమని ఆయన అన్నారు. ఐడీఓసీ కార్యాలయం అదనపు కలెక్టర్ ఛాంబర్ నందు నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాలు, వాటికి దారితీస్తున్న కారణాలు, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్ల వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 42 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గతంలో జరిగిన ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, అవసరమైన ఇంజినీరింగ్, రహదారి భద్రతా చర్యలను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని సూచించారు. జిల్లాలో జనవరి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు మొత్తం 349 రోడ్డు ప్రమాదాలు నమోదై 164 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ఒక్క ఆగస్టు నెలలోనే 36 రోడ్డు ప్రమాదాలు జరగగా 14 మంది మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదాల సంఖ్య, తీవ్రతను తగ్గించే విధంగా ప్రమాదాలకు గల ప్రధాన కారణాలను గుర్తించి, వాటి నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. గుర్తించిన 42 బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరికలు, సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, రహదారి మార్కింగ్ తదితర భద్రతా ఏర్పాట్లను పూర్తి స్థాయిలో చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు రహదారి భద్రతా సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు గోల్డెన్ అవర్‌లో అత్యవసర వైద్య సేవలు అందేలా బ్లాక్ స్పాట్లకు సమీపంలోని ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని, అంబులెన్స్ సేవలు వేగంగా అందుబాటులోకి వచ్చేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారి వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి అనూష, జిల్లా ఇంటర్మీడియట్ శాఖాధికారి వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్ కుమార్, ఐఆర్‌పీడీ జిల్లా మేనేజర్ బాలాజీ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మామిళ్ళవాయి లో వైభవంగా తోగు జాతర



**అశ్వాపురం,ప్రభాతవార్త, సెప్టెంబర్ 10:**

వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని కోరుతూ మామిళ్లవాయి గ్రామంలో పూర్వీకుల నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాన్ని కొనసాగిస్తూ తోగు జాతర ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తోగు దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామం సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.సంప్రదాయంలో భాగంగా మేకపోతులను మొక్కుగా సమర్పించారు.డప్పు చప్పుళ్లు, గిరిజన సంప్రదాయ నృత్యాల నడుమ భక్తులు,గ్రామస్తులు ఉత్సాహంగా ఊరేగింపుగా తరలివెళ్లారు.మహిళలు, యువత, పెద్దలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని జాతరను వైభవంగా నిర్వహించారు.తరతరాలుగా కొనసాగుతున్న ఈ ఆచారం ద్వారా ప్రకృతిని,పంటలను,గ్రామ సంక్షేమాన్ని కోరుతూ తోగు దేవతను ప్రార్థించడం తమ సంప్రదాయమని గ్రామస్తులు తెలిపారు.పూర్వీకుల ఆచారాలను భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా తోగు జాతరను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## మణుగూరులో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్10:**



మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం హనుమాన్ టెంపుల్ సెంటర్ వద్ద తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరీనాకి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవిలు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ధీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూచిపూడి బాబు, పాతూరు వెంకన్న, మండల రజక సంఘం అధ్యక్షుడు ఘంటసాల శ్రీను, మైనారిటీ సెల్ అధ్యక్షుడు రహీం భాషా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బర్ల శ్వేతన్, పట్టణ అధ్యక్షుడు పొడుతూరి రవి, బత్తుల శ్రీను, దొడ్డపినేని మధుకుమార్, కొర్లకుంట అప్పారావు, ఎస్కే సలీమ్, వాసంశెట్టి వెంకట్రావు, పల్లం నాగేశ్వరరావు, పొడుతూరి నానాజీ, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు కూర పాటి సౌజన్య, వేముల స్వరూప, చప్పిడి మాధురి, షబానా పాల్గొన్నారు.

## ఏరియాలో పర్యటించిన ఎం.సి. పర్గాయిన్



**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబరు 10**

:సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా గనుల్లో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ బెల్ట్ అభివృద్ధి పనులను సింగరేణి సంస్థ పర్యావరణ, అటవీ సలహాదారు ఎం.సి. పర్గాయిన్ గురువారం పరిశీలించారు. ఏరియా ఇల్లందు గెస్ట్ హౌస్ వద్ద జీఎం దుర్గం రామచందర్, అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఏరియా నర్సరీని సందర్శించిన ఆయన, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా స్థానిక వృక్ష జాతుల మొక్కలను అధికంగా పెంచాలని అధికారులకు సూచించారు. మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ లో గని తవ్వకాలు పూర్తయిన భూముల్లో పైలట్ ప్రాజెక్టుగా సాగు చేసిన మొక్కజొన్న పంటను, మియావాకి అడవిని, గోదావరి వరద రక్షణ కట్టపై పెంచినమొక్కలనుపరిశీలించారు. అనంతరం పి.కె.ఓసి2 గనిలో మొక్కల పెంపకం చర్యలను పరిశీలించి, నాటిన మొక్కల మనుగడ శాతాన్ని పెంచేందుకు నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఈ పర్యటనలో ఏరియా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## అండర్17 వాలీబాల్ జిల్లా స్థాయికి గ్రేస్ మిషన్ విద్యార్థులు



**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 10:**

మణుగూరు గ్రేస్ మిషన్ స్కూల్ విద్యార్థులు అండర్17 వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి అర్హత సాధించిన విద్యార్థులను గురువారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలతో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని, జిల్లా స్థాయిలోనూ రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని యాజమాన్యం ఆకాంక్షించినట్లు పాఠశాల ఇన్చార్జి పుల్లారావు, ప్రిన్సిపాల్ మల్లేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమం లో సెక్రటరీ శామ్యూల్, పీఈటీ వెంకటేశ్వర్లు, వార్డెన్ వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

**అశ్వాపురం,ప్రభాతవార్త, సెప్టెంబర్ 10;**



అశ్వాపురంరజక సంఘం ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని నిర్వహించారు. గురువారం ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. రజక సంఘం నాయకులు మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ రజక సమాజానికి మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజలందరికీ స్ఫూర్తినిచ్చిన ధైర్యవంతమైన మహిళా పోరాట యోధురాలన్నారు. ఆమె చూపిన ధైర్యం, ఆత్మవిశ్వాసం,పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతామని తెలిపారు. రజక సమాజానికి ఐలమ్మ తెచ్చిన కీర్తి,గౌరవం తమకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. రాజ్యాధికార పార్టీ అశ్వాపురం మండల అధ్యక్షులు విలాసా గరం కోటేశ్వరరావు మాట్లాడుతూ చాకలి ఐలమ్మను తెలంగాణ సమాజం ఎప్పటికీ మరచిపోదని, పేదల హక్కుల కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శ ప్రాయమన్నారు.ఈ కార్యక్రమంలో రజక సంఘ అధ్యక్షులు గోకినపల్లి పెద్ద సత్యనారాయణ,గోకనపల్లి సత్యనారాయణ, మంచినీళ్ల లక్ష్మయ్య,నిమ్మల సత్యం,గోకినపల్లి శివకృష్ణ రవి,కృష్ణ,వెంకటేశ్వర్లు,సంపత్,రేగళ్ల వెంకటేశ్వర్లు, గోకినపల్లి మల్లమ్మ, గద్దల నాగేశ్వరరావు కార్మిక అధ్యక్షులు రాము తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల ఖర్చులకు ఆర్థిక సహాయం

**అశ్వాపురం, ప్రభాతవార్త, సెప్టెంబర్ 10:**



మండలంలోని మొండికుంట గ్రామపంచాయతీకి చెందిన యువకుడు పాయం రాజు అనారోగ్య కారణంతో మృతి చెందటంతో విషయం తెలుసుకున్న మొండికుంట గ్రామపంచాయతీ సర్పంచ్ మద్రి సంధ్య,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసరబాద శ్రీనివాస్,మద్రి మల్లారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మృతుడి నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం సర్పంచ్ మద్రి సంధ్య రూ.5,000, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాసరబాద శ్రీనివాస్ రూ.3,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని మనోధైర్యం కోల్పోవద్దని సూచించారు.ఆపద సమయంలో నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న వీరిని స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మద్రిమల్లారెడ్డి,పాయంఎర్రయ్య,తాటిపాముల రమేశ్,జంపాల ఉపేందర్,పాయం సీతారాములు,బట్టా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




## డయాగ్నొస్టిక్ సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 10:**



జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు గురువారం మణుగూరు, అశ్వాపురం మండలాల్లోని పలు ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లలో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్లలోని రికార్డులు, రిజిస్టర్లు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ అనుమతులు, రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. ముఖ్యంగా నిబంధనలు పాటించని, లోపాలు ఉన్న డయాగ్నొస్టిక్ సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు, తనిఖీల సమగ్ర నివేదికను డీఎంహెచ్ఓకు సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రాందాస్, డాక్టర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు పీఏసీఎస్ కు డ్రోన్

**మణుగూరు, ,ప్రభాతవార్త, సెప్టెంబర్10:**



రైతులకు ఆధునిక సాంకేతిక సేవలు అందించడమే లక్ష్యంగా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ నిధుల ద్వారా మణుగూరు పీ ఏసీఎస్ కు వ్యవసాయ డ్రోన్‌ను అందజేశారు. సొసైటీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఈ డ్రోన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. పంట పొలాల్లో ఎరువులు, పురుగుమందుల పిచికారీని తక్కువ సమయంలో, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీనివల్ల రైతులకు శ్రమ, సమయం మరియు ఖర్చులు ఆదా అవుతాయని తెలిపారు. మండల రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మణుగూరు వ్యవసాయ అధికారి రాహుల్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ లు, రైతులు పిన్నమనేని మాధవి, గుమ్మల రాంబాబు, వట్టం రాంబాబు, అడపా అప్పారావు, ఆవుల నరసింహారావు, వావిలాల నరసయ్య, దాసరి వెంకట్, సీఈఓ సునీల్, తాజుద్దీన్, గుంటుపల్లి రాఘవులు, వినయ్, నెల్లూరి నరసింహారావు, తమ్మినేని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలి

**మణుగూరు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 10:**



తెలంగాణ సాయుధ పోరాట యోధులు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని గురువారం మణుగూరులో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత హనుమాన్ టెంపుల్ సెంటర్‌లోని ఐలమ్మ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి డి. సుధాకర్ మాట్లాడుతూ . భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి, దొరల ఆగడాలు, నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. 1895లో వరంగల్ జిల్లా కిష్టాపురంలో జన్మించిన చిట్యాల ఐలమ్మ, చిన్ననాటి నుంచే సమాజం పట్ల అవగాహనతో భూస్వాములపై తిరగబడ్డారని గుర్తుచేశారు. 1985 సెప్టెంబర్ 10న పాలకుర్తిలో ఆమె కన్నుమూశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎడారి రమేష్, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు సోందే కుటుంబరావు, సహాయ కార్యదర్శులు తోట రమేష్, వేర్పుల నరేష్, ఏఐటీయూసీ నాయకులు కొత్తపల్లి సీతారాములు, ఆధర్ల రాములు, బోశెట్టి సంపత్, రంగు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు శాంతికి ప్రత్యేకంగా నిలవాలి: డీఎస్పీ

**ఇల్లందు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు సూచించారు. గురువారం ఇల్లందు పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీలతో నిర్వహించిన శాంతిభద్రతల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసుల అనుమతి తప్పనిసరి ప్రతి గణేష్ మండప నిర్వాహకుడు పోలీస్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. విద్యుత్ సరఫరా, లైటింగ్ ఏర్పాట్ల విషయంలో సంబంధిత అధికారుల అనుమతి పొందాలని తెలిపారు. మండపాల వద్ద భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు వాలంటీర్లను నియమించుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత డీజేలకు అనుమతి లేదు సౌండ్ సిస్టమ్ వినియోగంలో నిబంధనలు పాటించాలని డీఎస్పీ స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల తర్వాత



డీజేలు, అధిక శబ్దంతో కూడిన లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులపై చర్యలు మత సామరస్యానికి భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించరాదని వెంకన్న బాబు తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పోస్టులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. పోలీసుల సూచించిన మార్గంలోనే



శోభాయా త్ర గణేష్ నిమజ్జనం రోజున పోలీసులు కేటాయించిన మార్గంలోనే శోభాయాత్ర నిర్వహించాలని డీఎస్పీ సూచించారు. మద్యం సేవించి గొడవలకు దిగితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గణేష్ మండపాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సీఐ తాటిపాముల సురేష్ గౌడ్, ఎస్సై ఉమా, కానిస్టేబుళ్లు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## రీ సర్వే మాత్రమే భూ సేకరణ కాదు:తహసీల్దార్



**పినపాక, ప్రభాత వార్త, సెప్టెంబర్ 10.**

మండల పరిధిలో చేపడుతున్నది కేవలం రిసర్వే మాత్రమేనని, భూ సేకరణ సర్వే కాదని తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రిసర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. రైతుల సమక్షంలో భూముల హద్దులను జీపీఎస్ సాంకేతికతతో గుర్తించి, ఖచ్చితమైన మ్యాప్‌ను తయారు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని 8 గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూములను సైతం సర్వే చేసి వివరాలను నమోదు చేస్తామని తెలిపారు. భూముల వివరాలు, హద్దుల విషయంలో స్పష్టత తీసుకురావడమే రిసర్వే ప్రధాన ఉద్దేశమని తహసీల్దార్ తెలిపారు. రైతులు, భూ యజమానులు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిత, సర్వేయర్ నరేష్, జిపిఓలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందుకు సీతారామ జలాలు అందించాలి

**ఇల్లందు అర్బన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**

సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లందు నియోజకవర్గానికి అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రైతు సంఘం ఇల్లందు మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లందుకు అందించేందుకు తొలిదశ డిజైన్‌లో భాగంగా పైప్‌లైన్లు ఏర్పాటు




చేసినప్పటికీ, అనంతరం డిజైన్ మార్చి వేసిన పైపులను సైతం తొలగించారని ఆరోపించారు. ఇల్లందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీరు తప్ప మరో ప్రత్యామ్నాయ సాగునీటి వనరు అందుబాటులో లేదన్నారు. సీతారామ జలాలను ఇల్లందుకు తరలించకపోతే నియోజకవర్గం శాశ్వత సాగునీటి సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ ఈ ప్రాంత రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. గిరిజన, వెనుకబడిన ప్రాంతమైన ఇల్లందు నియోజకవర్గంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లందు నియోజకవర్గానికి అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని బుర్ర వెంకన్న డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జూకంటి గాంధీ, బందారి సత్యం, బద్రు, లక్ష్మయ్య, బాలస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలలో పారిశుద్ధ్య పనుల ముమ్మరం



**కామేపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

కామేపల్లి మండల పరిధిలోని అన్ని పంచాయతీలు, గ్రామాలలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని ఎంపీడీవో ధరావత్ సోంలాల్, ఎంపీవో వివిఎస్ శాస్త్రి గురువారం పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులను కోరారు. పంచాయతీ సిబ్బందికి యూనిఫామ్, శానిటేషన్ కిట్ల ను కూడా అందజేయాలని కోరారు. ఈ విషయం లో సర్పంచులు, కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, క్లోరినేషన్, దోమల నివారణ తదితర పనులకు అవసరమైన పారలు, తట్టలు, గడ్డపారలు, చీపురు కట్టలు, ఫాగింగ్ మిషిన్లు, తైవాన్ పంపుసెట్లు, దోమల మందు, గడ్డి మందు, బ్లీచింగ్ పౌడర్, సున్నం ను పంచాయతీ సిబ్బం దికి అందించాలని, అట్టి కిట్లను ప్రతి పంచాయతీలో సిబ్బందికి విధిగా అందజేయాలని కోరారు. శానిటేషన్ సామాగ్రి ఉండటం వలన గ్రామాలలో శానిటేషన్ పనులు శరవేగంగా సాగుతాయని, పల్లెల్లో తద్వారా పరిశుభ్రత, పచ్చదనం, ప్రజా రోగ్యం, ప్రగతి నెలకొంటుందని వారు

# స్కౌట్స్ నైపుణ్యాలకు పదును ప్రొఫిషియన్సీ బ్యాడ్జ్ వర్క్‌షాప్ ఘనంగా ముగింపు

**ఇల్లందు అర్బన్, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**

సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల ప్రొఫిషియన్సీ బ్యాడ్జ్ వర్క్‌షాప్ గురువారం ఘనంగా ముగిసింది. ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య ఆదేశాల మేరకు, డీజీఎం (పర్సనల్), స్కూల్ కరస్పాండెంట్ అజ్మీర్ తుకారం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8న ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగింది. వర్క్‌షాప్‌లో స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, స్వయంకృషి, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావం, బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. వర్క్‌షాప్‌లో భాగంగా



పలు శిక్షణా కార్యక్రమాలతో పాటు రాత్రి ఫైర్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు, సాంస్క ృతిక కార్యక్రమాలతో అలరించడంతో పాటు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉత్సా హంగా ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అజ్మీర్ తుకారం విద్యార్థులను అభినందించారు. మూడు రోజుల శిక్షణపై విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమాన్ని ఆర్గనైజర్ జి. సుధాకర్ సమన్వయం చేయగా, లీడర్ ఆఫ్ ది కోర్స్ ఎల్. వెంకటస్వామి, గైడ్స్ టీచర్ సరిత పర్యవేక్షించారు. సింగరేణి స్కూల్ ఇల్లందు హెచ్‌ఎం ఫుల్ సింగ్, స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు, శిక్షకులు, నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా చండీ హోమం

**కామేపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త :**

కామేపల్లి లోని గురు మందిరంలో గురువారం రాత్రి చండీ హోమం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గురు హరిహర క్షేత్రం అవరోధాలు లేకుండా నిర్మాణ పనులు జరగాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ తలపెట్టిన చండీ హోమం ఘనంగా జరిగింది. బలగం భార్గవ శర్మ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో భక్త మండలి



అధ్యక్షులు గొట్టుపర్తి శివాజీ, అర్చకులు సాయికుమార్, నరసింహ శర్మ, కేసాని శేషారావు, రఘుకుమార్, బండి శ్రీనివాస్, కేశ గాని నాగయ్య, రవి, దమ్మాలపాటి శివాజీ, కోట గిరి రాము, భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**కామేపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ధరావత్ సోంలాల్ పిలుపు నిచ్చారు. కామేపల్లి మండల ప్రజా పరిషత్ కా ర్యాలయంలో గురువారం ఏఐడీ జే ఆర్ సి సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన పై ని ర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసం గించారు. గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలనకు పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకో వాలని కోరారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చే యాల్సి న బాధ్యత అందరి పైన ఉందన్నారు.

# రాజకీయాల్లో ప్రజా సేవలకు నిలువెత్తు రూపం పైడి



**దమ్మపేట, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

దమ్మపేట మండల రాజకీయాల్లో 1980 కాలం నుంచి నేటి వరకు చెక్కుచెదరని ప్రజాదరణతో, రాజకీయ పార్టీల జెండాలకు అతీతంగా ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న నాయకత్వం మన ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొందింది. జెండాలు మారిన పదవులు మారినా, కాలాలు మారినా ప్రజాసేవే పరమావధిగా సాగుతున్న వీరి రాజకీయ ప్రస్థానం యువతకు, భావి తరాలకు ఆదర్శప్రాయం. 1980వ దశకంలో తుమ్మలతో రాజకీయ అరంగేట్రం చేసిన నాటి నుండి నేటి వరకు, క్షేత్రస్థాయి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ మమేకమయ్యారు. "ఆపద" అని ఎవరైనా తలుపు తట్టినా, "నేనున్నాను" అంటూ అభయహస్తం అందిస్తూ ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తున్నారు. రాజకీయాన్ని కేవలం అధికార పీఠంగా చూడకుండా, సమాజ శ్రేయస్సుకు సాధనంగా మార్చుకోవడంలో వీరు ఎల్లప్పుడూ ముందుంటారు. ?మండల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, ఏ పార్టీ అధికారంలో ఉన్నా నియోజకవర్గ, మండల ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందారు. పార్టీ రంగులు, జెండాలు చూడకుండా సహాయం అర్థించి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆదరించడమే వీరి శైలి. గిరిజన ప్రాంతమైన గిరిజనులతో మమేకమై జడ్పిటిసిగా అలుపెరిగిన సేవ కుటుంబాన్ని పక్కన పెట్టి ప్రజాప్రస్థానం నేటికీ అదే ఉత్సాహంతో, ప్రజాదరణతో ముందంజ వేస్తున్నారు పైడి.

## మహిళా సమైక్య సర్వసభ్య సమావేశం

**దమ్మపేట రూరల్ సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**



ఆదర్శ మండల మహిళా సమైక్య సర్వసభ్య సమావేశం జిల్లా సమైక్య పర్యవేక్షణలో మండల సమైక్య కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో గడిచిన ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నిధులు, ఖర్చులు, ఆదాయ వ్యాయాలు, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంఘాల మహిళల అభ్యున్నతికి చేపట్టవలసిన కార్యచరణ ప్రణాళికలను తయారు చేయడం జరిగింది. పాలకోర్గ సభ్యుల పదవీకాలం ముగిసిన వారి స్థానంలో కొత్తవారిని ఎంపిక చేయడం జరిగింది. మండల సమైక్య ఏపిఎం సంతోష్ కుమార్, సిబ్బందితో పాటుగా జిల్లా డీపీఎం బ్యాంకు లింకేజీ, జీవనోపాదులు సమ్మక్క, డిపిఎం నాన్ ఫామ్ నరసయ్య, జిల్లా సమైక్య కార్యవర్గ కమిటీ సభ్యులు మోనిక, సర్వస్వతీ లు పాల్గొన్నారు.

## కెటీపీఎస్ 5, 6 దశలను సందర్శించిన శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తురై రాజా

**పాల్వంచ, సెప్టెంబర్ 10,ప్రభాత వార్త:**



శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తురై రాజా గురువారం పాల్వంచలోని కెటీపీఎస్ 5,6 దశల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శిం చారు. అధికారిక కార్యక్రమం నిమిత్తం ఢిల్లీకి వచ్చిన ఆయన, అనంతరం పాల్వంచలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చారు.ఈ సందర్భంగా విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.పర్యటనలో భాగంగా బొగ్గు నిల్వ కేంద్రం,ఆవిరి ఉత్పత్తి యంత్రం (బాయిలర్), విద్యుత్ ఉత్పత్తి చక్రం (టర్బైన్),బొగ్గు నిర్వహణ విభాగం (యూసీబీ), శీతలీకరణ గోపురాలు (కూలింగ్ టవర్లు) తదితర కీలక విభాగాలను పరిశీలించిన జస్టిస్ తురై రాజాకు ఆయా విభాగాల పనితీరు,విద్యుత్ ఉత్పత్తి విధానంపై అధికారులు సమగ్రంగా వివరించారు.ఈ సందర్భంగా కెటీపీఎస్ 5, 6 దశల ప్రధాన ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు పుష్పగుచ్ఛం అందజేసి జస్టిస్ తురై రాజాకు ఘన స్వాగతం పలికారు.అనంతరం జస్టిస్ తురై రాజా మాట్లాడుతూ,ప్రధాన ఇంజనీర్ ఎం. ప్రభాకరరావు పర్యవేక్షణలో విద్యుత్ కేంద్రం సమర్థవంతంగా నిర్వహించబడుతున్న తీరును అభినందించారు.విద్యుత్ కేంద్రంలోని నిర్వహణ ప్రమాణాలు, సాంకేతిక సామర్థం,సంప్రదాయాలను ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో బొగ్గు నిర్వహణ విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ మధుబాబు,సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్లు సమీర్,బి. రాధాకృష్ణ,జూనియర్ పరిపాలనా అధికారులు శ్రీనివాస్ రెడ్డి,వై.టి.ఎం.కె. రాజు (నానీ)తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాతపూర్వక హామీతోనే 'చలో హైదరాబాద్' వాయిదా

### 18న ప్రభుత్వంతో మలిదశ చర్చలు..

### పెండింగ్ డీఏలు, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్

**కొత్తగూడెం, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**



ప్రభుత్వ లిఖితపూర్వక హామీ మేరకే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు భద్రాద్రి జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, కార్మిక, పెన్షనర్ల జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం స్థానిక టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జేఏసీ జిల్లా ఛైర్మన్ అమరనేని రామారావు మాట్లాడుతూ... పీఆర్సీ నివేదికను త్వరగా పూర్తి చేసి ప్రభుత్వానికి సమర్పించాలని పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ శివశంకర్‌కు ప్రభుత్వం లేఖ రాసిందన్నారు. దసరా నుంచే పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ... ఈ నెల 18న ప్రభుత్వంతో మలిదశ చర్చలు జరగనున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కనీసం మూడు డీఏలను తక్షణమే చెల్లించాలని కోరారు. బిల్లుల చెల్లింపులకు నెలకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు నరసయ్య మాట్లాడుతూ... సీపీఎస్ రద్దుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. సీపీఎస్‌పై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 18న జరిగే చర్చల్లో ఉద్యోగుల ఆరోగ్య పథకంపై కూడా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. టీఎన్‌జీవోస్ జిల్లా కార్యదర్శి భార్గవ చైతన్య మాట్లాడుతూ... జేఏసీ నాయకత్వం వెనక్కి తగ్గలేదని, ప్రభుత్వమే చర్చలకు ముందుకు వచ్చిందన్నారు. 18న జరిగే చర్చల్లో స్పష్టమైన నిర్ణయాలు, ఉత్తర్వులు వెలువడకపోతే 19న జరిగే జేఏసీ విస్తృత సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీఎన్‌జీవో రాష్ట్ర కార్యదర్శి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోలు బంకులో పనిచేస్తున్న సిబ్బంది అవకతవకలపై ఫిర్యాదు

**దుమ్ముగూడెం: ప్రభాతవార్త (సెప్టెంబర్ 10)**

మండల పరిధిలోని లక్ష్మీ  ్మనగరం గ్రామ శివారులో ఉన్న పెట్రోల్ బంక్ లో పనిచేస్తున్న సిబ్బంది చేసిన అవకతవకలపై పెట్రోలు బంకు యజమాని గురువారం దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు ప్రతిరోజు పెట్రోల్ డీజిల్ శాంపిల్స్ కోసం తీసిన పెట్రోల్ డీజిల్ ను సిబ్బంది మాయం చేశారని గత కొన్ని నెలలుగా బంకులో పనిచేస్తున్న సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు రోజుకు సుమారు 200 లీటర్ల చొప్పున గత కొన్ని నెలలుగా చేతివాటాన్ని ప్రదర్శించారంటూ బంకు యజమాని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాడు దీంతో పోలీసులు విచారణ చేపట్టారు




## రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

### పామాయిల్ ఫ్యాక్టరీని పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి

**అశ్వారావుపేట అర్బన్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**



అశ్వరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని పామాయిల్ ఫ్యాక్టరీలో స్టాక్ నిలిచిపోవడంతో లోడు తీసుకువచ్చిన ట్రాక్టర్లతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సమాచారం అందడంతో అశ్వరావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ ఫ్యాక్టరీ వద్దకు గురువారం వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో స్టాక్ నిలిచిపోవడం వల్ల రైతులు, ట్రాక్టర్ యజమానులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు తీసుకొచ్చే పామాయిల్ గెలలు ఎప్పటికప్పుడు అన్‌లోడ్ అయ్యేలా చూడాలని, స్టాక్ నిల్వ కాకుండా ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జూపల్లి రమేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట మండలానికి చెందిన రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలినినోతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

### అదనంగా నూతన పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించాలి

**అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

ఎలినినో ప్రభావం లో రైతు సాగుచేసిన ప్రత్యామ్నాయ పంటలు వర్షాభావ పరిస్థితుల్లో ఎండిపోతున్నాయి అని, రైతు నష్టపోయిన పంటకు ఎక్స్ గ్రేసియా చెల్లించి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సమావేశంలో పుల్లయ్య మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీడు భూములకు సాగునీరందించే ప్రాజెక్టుల కోసం, పోడు భూములకు పట్టాలు, కౌలు రైతులకు న్యాయం చేయాలని, పంట రుణాలు, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరాఫరా, నేటికి రుణ మాఫీ అమలు కాని రైతులకు వెంటనే చేయాలని, పెండింగ్ రైతు భరోసా నిధులను ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పామాయిల్ విస్తరిస్తున్న తరుణంలో సాగు కు అనుగుణంగా గెలలు దిగుబడి అవుతున్న దృష్ట్యా అశ్వారావుపేట లోనే మరో నూతన ఆయిల్ ఫాం పరిశ్రమ ను నిర్మించి రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని అన్నారు. ఈ ఏడాది 15 నుంచి 18 వరకు నల్లగొండ లో జరిగే ఏఐకేఎస్ 36 వ రైతు మహా సభలు ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోఎం వెంకటేశ్వరరావు, గంగరాజు, నిర్మల, మడకం గోవిందు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.






# సత్తుపల్లిలోచాకలి ఐలమ్మకు వర్ధంతి వేడుకలు

## హాజరైన కాంగ్రెస్ నేత డాక్టర్ మట్ట

**సత్తుపల్లిసెప్టెంబర్ 10 ప్రభాతవార్త**

వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు సత్తుపల్లి పట్టణంలో గురువారం పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో రజక సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారుఅనంతరంసత్తుపల్లి-వేంసూర్ రోడ్డులోని ధోబీఘాట్‌లో పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి



ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి/విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద మాట్లాడుతూచాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణ వరపు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దామెర రమేష్, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనందబాబు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, సత్తుపల్లి రజక సంఘం అధ్యక్షులు విరివాడ నాగభూషణం, వార్డు కౌన్సిలర్లు, ఇరువాడ అపర్ణ, జగన్నాథం శీను, బండారు భరత్, జి కృష్ణయ్య, పట్టణ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ కమల్ పాషా, బొంతు వేణు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి డిస్పెన్సరీలో వైద్యుల కొరత, అదనపు పడకలు పెంచండి

## సీఎంఓ కిరణ్ కుమార్‌ను కలిసిన సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్

**సత్తుపల్లి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**

సత్తుపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని కొనసాగుతున్న డిస్పెన్సరీ లో ఉన్నటువంటి రెండు పడకల బెడ్స్ ను అదనంగా పెంచాలని, వైద్యుల కొరత, వైద్య పరికరాలు సమస్య పరిష్కరించాలని కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ లోని చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ ను సత్తుపల్లి ఏరియా ఐ ఎన్ టి యు సి వైఎస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా గురువారంకలిసివివరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూసింగరేణి వ్యాప్తంగా సత్తుపల్లి ఏరియా నుంచి దాదాపు 20 శాతం బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. సత్తుపల్లి ఏరియా 12వ ఏరియాగా ఆవిర్భవించిన నేపథ్యంలో కార్మికులు, అధికారులు,



వారికుటుంబాల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సత్తుపల్లిలో ఏరియా హాస్పిటల్ నిర్మించాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్‌ను విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం సత్తుపల్లిలో ఉన్న డిస్పెన్సరీలో కేవలం రెండు పడకలు మాత్రమే ఉన్నాయని, పెరుగుతున్న వైద్య అవసరాలకు అనుగుణంగా అదనపు పడకలను ఏర్పాటు చేయాలని కోరారు. డిస్పెన్సరీలో సిబ్బంది కొరత, అవసరమైన వైద్య పరికరాల సమస్యలను కూడా పరిష్కరించాలని కోటేశ్వరరావు సీఎంఓ కు విజ్ఞప్తి చేశారు. గతంలో సత్తుపల్లికి మహిళా డాక్టర్‌ను నియమించాలని ఐఎన్‌టీయూసీ తరఫున వినతిపత్రం అందజేసిన వెంటనే కేవలం 15 రోజుల్లో మహిళా డాక్టర్‌ను నియమించినందుకు చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్‌కు కోటేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోఐఎన్‌టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, ఫిట్ సెక్రటరీ షణ్ముఖ చారి, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి బిఆర్ఎస్ నేతలు ముందస్తు అరెస్ట్

**సత్తుపల్లి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**



హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడి, నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ పిలుపునిచ్చిన నేపథ్యంలో సత్తుపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ కీలక నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలనుతెల్లవారుజాము నుంచే ఇళ్ల వద్ద ముందస్తుగా పోలీసులు గురువారం హౌస్ అరెస్ట్ చేయటం జరిగింది. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రజల గొంతుకగా నిలిచే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్ట్‌లతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బిఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. హౌస్ అరెస్ట్‌లతో ప్రజల గొంతును నొక్కలేరుప్రజాస్వామ్య హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందిబీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ నిర్బంధాలను వెంటనే ఎత్తివేయాల నీ అరెస్టులకు గురైన మాజీ మున్సిపల్ చైర్మన్ కూసం పూడి మహేష్, వల్లభనేని పవన్, షేక్ చాంద్ పాషా, రఘు, మిద్దె శీను, ఆనందరావు, మల్లూరి అంకమ్మరాజు తదితరులు డిమాండ్ చేశారు.

# క్రీడల్లో విశ్వశాంతి విద్యార్థులు ప్రతిభ

**సత్తుపల్లి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**



సత్తుపల్లి మండల స్థాయిలో ప్రభుత్వం నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విశ్వశాంతివిద్యార్థులకుబహుమతులు అందజేశారు. విశ్వశాంతి విద్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్ అందజేసిఅభినందించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన గోవర్ధన్ అనే విద్యార్థి జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం విశేషం. అలాగే క్రీడల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులు గోవర్ధన్, ఉదయ్ భార్గవ్, రామ్‌చరణ్, గోపీచంద్, భార్గవ్, వికాస్, సుశాంత్ బాబు, రిషి తదితరులు ఉన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచడం పాఠశాలకు గర్వకారణమని హెడ్మాస్టర్ యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, సత్యనారాయణ పేర్కొన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు.

# ఖమ్మం గడ్డపై జనసేన శంఖారావం

## పోస్టర్ ఆవిష్కరించిన జిల్లేళ్ళ మహేష్

**కల్లూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**

జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 13న ఖమ్మంలో నిర్వహించనున్న 'జనసేన తెలంగాణ శంఖారావం' సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ జిల్లా నాయకులు జిల్లేళ్ళ మహేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన పోస్టర్‌ను కల్లూరు పట్టణంలో ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లేళ్ళ మహేష్ మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన పార్టీ ప్రజలకు అండగా నిలిచే శక్తిగా భవిష్యత్‌లో మరింత బలోపేతం అవుతుందని అన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఖమ్మం జిల్లాలో జనసేన రాష్ట్ర నాయకులు గడల శ్రీనివాసరావు నాయకత్వంలో పార్టీ బలోపేతమవుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేన భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసేలా ఈనెల 13న ఖమ్మంలో జరగనున్న 'తెలంగాణ శంఖారావం' సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఖమ్మం తరలివచ్చి సభను విజయవంతం చేయాలని జిల్లేళ్ళ మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తాళ్లూరి నర్సింహారావు, బుర్రి లక్ష్మణ్ రావు, సాయి, ఫణి క్రిష్ణ, బొడ్డు గణేష్, ఇక్బాల్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# తొలి సాయుధ పోరాటపు వీరనారి ఐలమ్మ

**పెనుబల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**

తెలంగాణ తొలి సాయుధ పోరాటపు వీరనారి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలను గురువారం పెనుబల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. పెనుబల్లి మండల రజక సంఘం అధ్యక్షులు పంతంగి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వి ఎం బంజర్ అంబేద్కర్ సెంటర్లోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 1895లో వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిరుపేద కుటుంబంలో ఐలమ్మ జన్మించింది. ఆమె వృత్తే ఇంటిపేరుగా మారింది ఆనాటి నుండే చాకలి ఐలమ్మగా పేరుగాంచింది. తెలంగాణలో దేశ్ ముఖ్ లు భూస్వాములు, జమీందారులు జాగిర్దారులు పటేల్ పట్వారి వ్యవస్థ తోపాటు వారి దౌర్జన్యాలు దోపిడీలు గ్రామాలలో కొనసాగుతుండేవి. ఇక్కడే చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటపు తొలి వీరనారిగా మారింది. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పంతంగి వెంకటేశ్వరావు, భోగి మోహన్ రావు, కావిటి శ్రీను, రాజకీయ పార్టీ నాయకులు పంది వెంకటేశ్వరరావు, చలమాల విఠలావు, వియం బంజర సర్పంచ్ బుక్య ప్రసాద్, పెనుబల్లి సర్పంచ్ బానోతు పాప, మేకతొట్టి కాంతయ్య, గాయం తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నకోరుకోండి బిసి హాస్టల్ ను సందర్శించిన ఎంపీడీవో

**కల్లూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**కలెక్టర్ ఆదేశానుసారం ఎంపీడీవో



చంద్రశేఖర్ మండల పరిధిలోని చిన్నకోరుకోండి బిసి హాస్టల్ ను సందర్శించారు. స్టోర్ రూము లో స్టాక్ ను పరిశీలించి విద్యార్థులకు పరిశుభ్రమైన రుచికరంగా వండి పెట్టాలని ఆదేశించారు .విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార పదార్థాలను పరిశీలించారు. వంట రూమును పరిసరాలను శుభ్రంగా ఉంచాలని తద్వారా హాస్టల్ విద్యార్థులకు అనారోగ్యం బారిన పడకుండా చూడాలని వార్డెన్ కి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మహేష్, వార్డెన్ ఉన్నారు.

# కాలువల్లో వినాయక నిమజ్జనం వద్దు

## దంసలాపురం, తీర్థాల జలాశయాల్లోనే నిర్వహించాలి

ప్రభాత వార్త ఖమ్మం రూరల్:

వినాయక విగ్రహాల నిమజ్జనంపై ఏదులాపురం మున్సిపాలిటీ కీలక సూచనలు చేసింది. మున్నేరు కాలువతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని కాలువలు, చెరువులు, ఇతర జలాశయాల్లో నిమజ్జనం చేయవద్దని మున్సిపల్ కమిషనర్ అల్లా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సూచనలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఎలినినో ప్రభావంతో స్థానిక జలవనరుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో కనీస నీటి నిల్వలు కూడా లేవన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక కాలువలు, చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం సరికాదని స్పష్టం చేశారు. రెండు చోట్లే నిమజ్జనంఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దంసలాపురం వద్ద ఉన్న జలాశయం లేదా తీర్థాల వద్ద ఉన్న జలాశయంలోనే నిమజ్జనం చేయాలని కమిషనర్ సూచించారు. వినాయక ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. స్థానిక జలవనరుల్లో నిమజ్జనాలు నిర్వహించకుండా మున్సిపాలిటీ సూచించిన ప్రాంతాలను వినియోగించాలని చెప్పారు. అధికారులకు సహకరించాలినిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని అల్లా శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసుల సూచనలు పాటించాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మున్సిపల్ అధికారులు, పోలీసు శాఖ, ఇతర సంబంధిత విభాగాలు సూచించే నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ తెలిపారు. వినాయక ఉత్సవ కమిటీలు తమ పరిధిలోని భక్తులకు నిమజ్జన ప్రదేశాలపై ముందుగానే అవగాహన కల్పించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




## దళిత ద్రోహుల బీఆర్ఎస్‌కి బుద్ధి చెబుతాం

నేలకొండపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

దళితుల పట్ల బిఆర్ఎస్ పార్టీ నాయకులు అహంకార పూరితంగా వ్యవహరిస్తున్నారని మండల కాంగ్రెస్ మహిళ నాయకురాలు కుమ్మరి నాగమణిధ్వజమెత్తారు. గురువారం కోనాయిగూడెంలోదళితులు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. నాగమణి మాట్లాడుతూ దళితులను అవమానించటమే కాకుండా రోడ్డు పై పసుపు నీళ్లను చల్లించి దొర అహంకారం చూపారని పేర్కొన్నారు. దళితుల సత్తా ఏమిటో దొరలకు తగిన బుద్ధి చెబుతామని ఆమె హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల తీరు మారకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో నేడు దళితులు పక్కా ఇళ్లను నిర్మించుకుంటున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మేకల వెంకటేశ్వర్లు, చెరుకుపల్లి రాజేష్, కర్ల ఆశోక్, వడ్డమూడి వెంకటేశ్వర్లు, చెరుకుపల్లి ఉపేందర్, కొత్తపల్లి నవీన్, కొమ్ము అఖిల్, మనోజ్, మండది నాగశ్రీను, చెరుకుపల్లి నరసింహారావు, కుమ్మరి దేవకర్ణ, సుధాకర్, వుల్లోజి రమ, జయరాజు, కుమ్మరి నారాయణ, శ్రీరాములు పాల్గొన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి

నేలకొండపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలని బిజెపి పాలేరు నియోజకవర్గ ఇంచార్జ్ నున్నా రవికుమార్, నేలకొండపల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపు నిచ్చారు. గురువారం నేలకొండపల్లి లోని పిఎసిఆర్ సెంటర్ నందు మండల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత చాకలి ఐలమ్మ విగ్రహంకు బిజెపి నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బిజెపి పాలేరు



నియోజకవర్గ ఇంచార్జ్ నున్నా రవికుమార్, నేలకొండపల్లి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో దేశ్ ముఖులు, భూస్వాములు, జమీందారులు, జాగిర్దారులు, పటేల్ పట్వారి దౌర్జన్య వ్యవస్థ కు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ పోరాడిందని వారు చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి మహిళ వీరనారి చాకలి ఐలమ్మ అని వారు చెప్పారు. చాకలి ఐలమ్మ వారసత్వంతో బిజెపి శ్రేణులు ప్రజా ఉద్యమాలను మరింతగా చేపట్టాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి గ్రామ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి, బ్రాహ్మణ సంఘం జాతీయ నాయకుడు ఇంగువ రామకృష్ణ శర్మ, బిజెపి మండల నాయకులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, నూరేపల్లి జ్ఞానరత్నం, పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్ తుపాకుల సంజన, మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి కందరబోయిన వెంకటరమణ, కందరబోయిన గోపి, ధారావత్ వీరు నాయక్, అనసూర్య, కోటి హనుమంతరావు, ఎలిగేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## డ్రిప్ ఇరిగేషన్ పంటల సాగు పై దృష్టి సారించాలి

నేలకొండపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

డ్రిప్ ఇరిగేషన్ పంటల సాగు పై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉద్యానవన పాలేరు డివిజన్ అధికారిణి అపర్ణ వెల్లడించారు. గురువారం నేలకొండపల్లి లోని రైతు వేదిక నందు ఆత్మా ఆధ్వర్యంలో రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ



మాట్లాడుతూ ఉద్యానవన పంటల పై రైతులకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో నీటి తక్కువ వినియోగం పంటలను సాగు చేయాలని చెప్పారు. పంటల సాగులో మెళకువలు, చీడపీడల నివారణ చర్యలు, అధిక దిగుబడులు సాధించేందుకు సూచనలు పాటించాలని ఆమె చెప్పారు. ప్రకృతి వ్యవసాయం వైపు ముందుకు సాగాలని ఆమె సూచించారు. ప్రస్తుత. పరిస్థితులలో పప్పు దినుసులు సాగు చేయాలని అన్నారు. ఉద్యానవన శాఖలో అందుబాటులో ఉన్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె చెప్పారు. ఆయిల్ ఫామ్, కూరగాయాల సాగు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. పలు అంశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 24 గంటల పాటు కరెంటు సరఫరా చేసి ఎండిపోతున్న పంటలను కాపాడండి

నేలకొండపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:

24 గంటల పాటు కరెంటు సరఫరా చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుడవర్తి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వి.రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ మోటార్లకు 24 గంటల పాటు కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మండల రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు గురువారం నేలకొండపల్లి లోని పిఎసిఆర్ సెంటర్ నందు గల కరెంట్ ఆఫీస్ ముందు రోడ్డు పై బైఠాయించి రాస్తారోకో, ధర్నా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుడవర్తి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.వి.రామిరెడ్డి మాట్లాడుతూ ఎలినినో ప్రభావం వలన వర్షాలు కురవని కారణంగా రైతులు సగం భూములలో మాత్రమే పంటలు వేశారని చెప్పారు. అరకొరగా వేసిన పంటలను



కాపాడాల్సిన ప్రభుత్వం రైతులకు రోజుకి 6 గంటల నుంచి 8 గంటలు మాత్రమే త్రి ఫేస్ కరెంటు ఇస్తున్నారని, దీనివలన పంటలు ఎండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న మధిర నియోజకవర్గం లోని ముదిగొండ మండలంలో 24 గంటల పాటు రైతుల మోటార్లకి కరెంటు ఇస్తున్నారని, నేలకొండపల్లి మండలంలో రైతులు ఏం పాపం చేశారని కరెంటు ఇవ్వటం లేదని వారు ప్రశ్నించారు. నేలకొండపల్లి మండలం లోని రైతాంగం పట్ల ఇంతటి వివక్షత ఏమిటో స్థానిక శాసనసభ్యులు, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రైతులకు స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, పక్కనే ఉన్న కోదాడ నియోజకవర్గంలో సాగర్ జలాలు అందిస్తున్నారని, కానీ మన రైతాంగానికి సంబంధించిన పంట పొలాలకు మాత్రం నీళ్లు ఇవ్వటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జోక్యం చేసుకొని పాలేరు పాతకాలవ తో పాటు ఎన్ఎస్పీ కాలువలకి కూడా సాగర్ నీళ్లు ఇచ్చి, రైతులు వేసిన పంటలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం, నేలకొండపల్లి విద్యుత్ ఏఈ రవికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నేలకొండపల్లి మండల కార్యదర్శి రచ్చ నరసింహారావు, రైతు సంఘం పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు ఎర్ర తిరపతిరావు, రైతులు గోవిందరావు, వెంకన్న, నోముల పుల్లారావు, జొగువర్తి వెంకయ్య, గుడవర్తి శ్రీనివాసరావు, తాటికొండ భాస్కరరావు, బెజవాడ నాగేశ్వరరావు, షేక్. నబి, రావెళ్ల అజయ్ కుమార్, పి.నాగేశ్వరరావు, సామాల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీలోకి ఇద్దరు సీపీఐ కౌన్సిలర్లు





ఖమ్మం రూరల్, ప్రభాత వార్త

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 30, 32వ వార్డులకు చెందిన సీపీఐ కౌన్సిలర్లు దండి శ్రీజ, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డికి ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. గురువారం యాదగిరిగుట్టలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ఏఐవైఎఫ్ మూడో మహాసభల్లో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మామిండ్ల శ్రీనాథ్ రెడ్డిని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, దండి శ్రీజను రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్‌తో పాటు పలువురు సీపీఐ నాయకులు, యువజన సంఘం నాయకులు, సభ్యులు వారికి అభినందనలు తెలిపారు. ఖమ్మం రూరల్ ప్రాంత యువజన ఉద్యమానికి దక్కిన గౌరవంగా కొనియాడారు. ఏఐవైఎఫ్ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిందిగా ఆకాంక్షించారు.

## తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

బోనకల్, ప్రభాతవార్త :

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి యంగల ఆనందరావు పిలుపునిచ్చారు. గురువారం ముష్టికుంట్ల గ్రామంలో వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 11న చిరునోముల లో తామ్రపత్ర గ్రహీత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావెళ్ల జానకిరామయ్య స్థూపం వద్ద తెలంగాణ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుక్కుల రామారావు పూలమాలలు వేసి వారోత్సవాలను ఘనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన యోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారోత్సవాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు , భూస్వామ్య, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ఉందన్నారు.

# ఎమ్మెల్యే పీఏల సిత్రాలు సూడతరమా..!

**పీఏల అక్రమ వసూళ్ల దందా వెనుక అసలు సూత్రధారులు ఎవరు.?**

**ఉద్యోగాలు, ఇసుక కాంట్రాక్టుల పేర్లతో అమాయకులకు కోట్ల రూపాయల కుచ్చుటోపి**

**అంతా సార్ కు తెలిసేజరిగిందా..?**

**వందల మంది బాధితులు క్యాంప్ఆఫీస్ చుట్టూ చక్కర్లు..**

**అయినా నిమ్మకు నీరెత్తినట్లు ఎమ్మెల్యే వ్యవహార తీరు.**

**పిఏ అరెస్టు వ్యవహారంలో పోలీసుల వ్యూహం ఏంటి.?**

**భద్రాచలంలో భారీ బెట్టింగ్ దందాలు నడుస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నట్లు.?**

**బాధితుల నుంచి వసూలు చేసిందంతా బెట్టింగ్లో పోగొట్టాడంటూ డీఎస్పీ స్టేట్మెంట్, రికవరీ మాత్రం నిల్**

**కొర్ల కళ్యాణ్ కుమార్ వసూలు చేసిన 10 కోట్లలో ఎవరి వాటా ఎంత..?**

**బాధితులకు న్యాయం చేసేది ఎవరు.?**

**డీజీపీ దృష్టి సారిస్తే.. అసలు విషయాలు వెలుగులోకి..?**

ఖమ్మం క్రైమ్ ప్రభాతవార్త (శ్యామ్ నల్లి )

ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పీఏ ల తీరు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు తీవ్ర సంచలనమైంది. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ముగ్గురు అధికార, అనధికార పీఏ లు గా చలామణి అవుతూ.. అక్రమ దందాకు యదేచ్ఛగా తెర లేపారు. గత కొంతకాలంగా ఇసుక కాంట్రాక్టుల పేరుతో.. కాంట్రాక్టర్ల నుంచి ప్రైవేట్ వ్యక్తుల నుంచి అందిన కాడికి దండుకుంటూ వచ్చిన ఎమ్మెల్యే ప్రైవేట్, ప్రభుత్వం నియమించిన పిఏ ల వ్యవహారం ఆ ప్రాంతంలో తీవ్ర సంచలనగా మారింది. ఎమ్మెల్యే చెప్పారంటూ అధికారులపై తీవ్ర ఒత్తిడి తేవడం ఇసుకరాంపుల పేరుతో వసూళ్లకు పాల్పడడం గత కొంతకాలంగా భద్రాచలం పినపాక చర్ల మణుగూరు ప్రాంతాల్లో తీవ్ర వివాదాస్పదం అవుతూ వస్తుంది ఈ నేపథ్యంలో గతంలో సదరు ప్రైవేట్ పీఏ కి కొందరు దేహశుద్ధి చేసి పోలీసు కేసు సైతం పెట్టినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఎమ్మెల్యే మెడకు చుట్టుకుంటుంది అనగా తనను కొంతకాలం దూరం పెట్టానని చెప్పుకోవడం ఎమ్మెల్యే వంతైంది. మరొక వ్యవహారంలో వ్యక్తిగత ఆంతరంగికుడు, అనుచరుడుగా చలామణి అయిన భరత్ అనే వ్యక్తి ఏకంగా కోట్ల రూపాయల మేర బస్సులు వాహనాలు కొనుగోలు చేసి ఒరిస్సా టు హైదరాబాద్ వాహనాలు తిప్పుతూ.. అందులో గంజాయి స్మగ్లింగ్ కు పాల్పడుతూ పోలీసులకు పట్టు పడడం తీవ్ర సంచలనం రేకెత్తించింది. అతడి వద్ద నుంచి పోలీసులు 54 కోట్ల మేర నగదు, వాహనాలు రికవరీ చేయడం చోటుచేసుకుంది. పోలీసులు వాహనాలు, నగదు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ కు తరలించడం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలోనూ సదరు ఎమ్మెల్యే పై తీవ్ర విమర్శలు ఎదురైన అవేమీ పట్టించుకోకుండా షరా మామూలే అన్నట్లు ప్రవర్తించడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. తాజాగా ప్రభుత్వం నియమించిన పిఏ కొర్ల కళ్యాణ్ కుమార్ ఏకంగా ఉద్యోగాలు కాంట్రాక్టుల పేరుతో 10 కోట్ల మేర వసూళ్లకు పాల్పడి నకిలీ అపాయింట్మెంట్లు సృష్టించి మోసాలకు పాల్పడడం, అనంతరం బెట్టింగుల్లో మొత్తం పోయింది అంటూ కహానీలు నడపడం దీనికి పోలీసులు వత్తాసు కూడా తోడైంది అంటూ స్థానికంగా తీవ్ర చర్చ జరగడం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. ప్రభుత్వం కేటాయించిన పిఏ కొర్ల కళ్యాణ్ కుమార్ అవినీతి దందాలో ఇప్పటివరకు సుమారు 150 మందికి పైగా బాధితులున్నారు, కోట్లాది రూపాయల మేర మోసం జరిగినట్లు వెల్లడవుతోంది. అయితే, కేవలం ఆరు నెలల వ్యవధిలోనే ఇద్దరు పీఏలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకుని ఇసుక, ఉద్యోగాల పేరుతో కోట్ల రూపాయలు దండుకోవడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం పక్కనే ఉండే పీఏల దందా ప్రజాప్రతినిధికి తెలియకుండా ఎలా సాగుతుందంటూ ఎమ్మెల్యే తీరుపై ప్రజలు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.గతంలో సబ్ కలెక్టరేట్లో పనిచేసిన అనుభవఉన్న కళ్యాణ్ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల సీళ్లు,శాఖల ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీచేస్తూ నకిలీ నియామక పత్రాలను సృష్టించ డంలోదిట్టగా మారాడు.మణుగూరు బీటీపీఎస్ భూ నిర్వాసితులు, ఐటీసీ, సింగరేణిసంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఫోన్లు చేసి ఒక్కొక్కరి వద్ద నుంచిరూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూళ్లకు తెగబడ్డాడు. చర్ల, భద్రాచలం, దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాల్లోనిఎమ్మెల్యే అనుచరులు, కాంగ్రెస్ నాయకులనేప్రధానంగా లక్ష్యంగా చేసుకుని ఈ దందానునడిపాడు. ఈ క్రమంలోనే భద్రాచలానికి చెందిఒక వైద్యుడి నుంచి రూ.40 లక్షలు, ప్రమోషన్ ఇప్పిస్తానని చెప్పి ఆబ్కారీ శాఖకు చెందిన ఒఅధికారి నుంచి రూ.10 లక్షలు కాజేసినట్లు తెలుస్తోంది.కేవలం ఉద్యోగాల పేరుతోనే కాకుండా ఇసుక ర్యాంపుల పేరుతోనూ కళ్యాణ్ కోట్లు కొల్లగొట్టాడు. నల్లగొండ, ములుగు, ఖమ్మం జిల్లాల నుంచి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు వచ్చే ఇసుక కాంట్రాక్టర్లు, స్థానిక యువజన కాంగ్రెస్ నాయకులతో ఒప్పందాల పేరుతో భారీగా డబ్బులు లాగాడు. ఉద్యోగాల నియామకాల్లో ఇచ్చిన ఫేక్ ఆర్డర్లు బయటపడటంతో కొందరికి డబ్బులు వెనక్కి ఇచ్చినప్పటికీ, మెజారిటీ బాధితులు మాత్రం నిలువునా మునిగిపోయారు.ఆరు నెలల క్రితం కూడా ఎమ్మెల్యే ప్రైవేటు పీఏగావ్యవహరించిన మరో వ్యక్తి ఇసుక ర్యాంపుపేరుతో కోట్ల రూపాయలు వసూలు చేయడంతో,ఆయనను కార్యాలయం నుంచి పక్కన పెట్టారని,అది మరవక ముందే మళ్లీ అదే క్యాంపు ఆఫీస్ కేంద్రంగా ప్రస్తుత పీఏ కల్యాణ్ కోట్ల రూపాయలు దండుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పక్కన తిరిగే వ్యక్తులు, నిరుద్యోగులను నట్టేట ముంచుతుంటే ఎమ్మెల్యే స్పందించిన తీరు, పర్యవేక్షణ లోపంపై బాధితులు మండిపడుతున్నారు.ఈ కుంభకోణంలో భద్రాచలానికి చెందిన రాయల శ్రీను అనే బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కల్యాణ్ పై కేసు నమోదు చేశారు. తన కొడుకు ఉద్యోగం కోసం ఆటోను, కూతురి బంగారాన్ని కుదువబెట్టి రూ.9.95 లక్షలు చెల్లించి మోసపోయానని, తమ కుటుంబం రోడ్డున పడిందని శ్రీను కన్నీరుమున్నీరయ్యాడు. అయితే పోలీసులకు ఫిర్యాదు చేసిన రాయల శ్రీను సైతం భద్రాచలం ఎమ్మెల్యే అనుచరుడుగానే తెలుస్తోంది. ఎవరైనా బయట వ్యక్తులు ఫిర్యాదు చేస్తే.. ఈ వ్యవహారం ఎటుపోయి ఎటు వస్తుందోనని అంతా తమ కంట్రోల్లో ఉండే విధంగా సెట్ చేసుకున్నారనే ప్రచారం సైతం స్థానికంగా సాగుతోంది. రాయల శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న భద్రాచలం టౌన్ పోలీసులు ఈనెల 6వ తేదీన నిందితుడు కొర్ల కళ్యాణ్ కుమార్ ను అరెస్టు చూపించారు. అయితే ఈ వ్యవహారంలో పోలీసులు విడుదల చేసిన ప్రెస్ నోట్ లో అసలు కళ్యాణ్ కుమార్ ఎక్కడ పని చేస్తున్నాడు..? అనే వివరాలు వెల్లడించకుండా అతను రెవెన్యూ డిపార్ట్మెంట్లో సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్నాడని పేర్కొన్నారు. నిందితుడు క్రికెట్ బెట్టింగ్లు ఆడి 8 కోట్లు పోగొట్టాడని వెల్లడించడం గమనార్హం.

### కోట్ల రూపాయల మేర క్రికెట్ బెట్టింగ్లు నడుస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారు..?

ఉద్యోగాలు కాంట్రాక్టుల పేరుతో కోట్ల రూపాయల మేర వసూళ్లకు పాల్పడిన భద్రాచలం ఎమ్మెల్యే పీఏ కొర్ల కళ్యాణ్ కుమార్ సుమారు 8 కోట్లు క్రికెట్ బెట్టింగ్ లు ఆడి డబ్బులు పోగొట్టాడని సాక్షాత్తు భద్రాచలం డి.ఎస్.పి అరుణ్ కుమార్ బహిరంగ స్టేట్మెంట్ ఇచ్చారు. కేవలం ఒక్కడే 8 కోట్ల రూపాయలు బెట్టింగ్లు ఆడాడు అంటే, భద్రాచలం సబ్ డివిజన్లోని బడా బాబులు, వ్యాపారులు, సిండికేట్ మెంబర్లు బెట్టింగ్ రాయుళ్లు ఇంకా ఎన్ని కోట్ల మేరా బెట్టింగ్లు నిర్వహించారో అర్థం చేసుకోవచ్చు. మరి ఇంత భారీగా భద్రాచలం కేంద్రంగా బెట్టింగ్ వ్యవహారం నడుస్తుంటే స్థానిక పోలీసులు నిఘా బృందాలు ఏం చేస్తున్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### డీజీపీ దృష్టి సారిస్తారా..?

భద్రాచలం ఎమ్మెల్యే అధికార, అనధికార పిఏ ల వ్యవహార శైలి రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. వందల కోట్ల రూపాయల మేర అక్రమ వసూళ్లకు పాల్పడుతూ అధికారులను బెదిరిస్తూ నకిలీ ఉద్యోగ నియామక పత్రాలు సైతం సృష్టించడం, ప్రభుత్వ శాఖల ఫైళ్ళ శీళ్లను సైతం తయారు చేయడం వందల మంది నుంచి కోట్ల రూపాయలు అక్రమ వసూళ్ల చేయడం ఈ వ్యవహారం ప్రభుత్వానికి సైతం తలనొప్పులు తెచ్చిపెడుతోంది. అయితే ఇప్పటివరకు ఎమ్మెల్యే తన పిఏల వ్యవహారంపై స్పందించకపోవడం కొసమెరుపు. నిఘా వర్గాల రిపోర్టులతో ఈ వ్యవహారం పై సీఎం సైతం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసు వ్యవహారంలో పోలీసులు వ్యవహరించిన తీరు బాధితులకు న్యాయం జరుగుతుందా అని స్థానికంగా చర్చకు రావడం, ఈ వ్యవహారంపై రాష్ట్ర పోలీస్ బాస్ సివి ఆనంద్ దృష్టి సారించి సిఐడి కు అప్పగిస్తారని సమాచారం తెలుస్తోంది.

# వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆదాయాన్ని పెంచేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు

**కోల్డ్స్టోరేజీలపై నిఘా..ప్రత్యేక బృందాలతో తనిఖీలు**

**అక్టోబర్ నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లకు సన్నద్ధం**

**పామాయిల్ గెలలు నాణ్యత పై అధికారుల పరిశీలన**

**ఏన్కూరు మార్కెట్ కార్యాలయంలో వరంగల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆకస్మిక తనిఖీ**

ఏన్కూరు, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త

వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆదాయాన్ని పెంచేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టామని..మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఏ.పద్మావతి తెలిపారు.మండల కేంద్రమైన ఏన్కూరులోని వ్యవసాయమా ర్కెట్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.మార్కెట్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించడంతో పాటు..మార్కెట్ యార్డు పరిసరాలను..పామాయిల్ గెలలను ఆమె పరిశీలించారు.మార్కెట్లో కొనుగోళ్లు.. క్రయ విక్రయాల నిర్వహణ..రికార్డుల నమోదు..తదితర అంశాలపై అధికారులను వివరాలు ఆమె అడిగి తెలుసుకున్నారు.

### కోల్డ్స్టోరేజీలపై కన్ను..

మార్కెటింగ్ శాఖ పరిధిలోని కోల్డ్స్టోరేజీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పద్మావతి తెలిపారు.కోల్డ్ స్టోరేజీల లో నిల్వలు.. లావా దేవీలు.. నిబంధనల అమలు తదితర అంశాలను పరిశీలించేందుకు ప్రత్యేక నిఘా బృందాలతో తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటా మని ఆమె స్పష్టం చేశారు.మార్కెటింగ్ శాఖ ఆదాయం పెరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు.

### సీసీఐ కొనుగోళ్లకు ఏర్పాట్లు..

త్వరలో పత్తి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అక్టోబర్ మొదటి తేదీ నుంచి సీసీఐ కొనుగోళ్ల ప్రారంభించేందు కు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్కెట్ యా ర్డులో అన్ని వసతులను సిద్ధం చేయాలని అధికారులకు ఆమె సూచించారు.పత్తి కొనుగోళ్ల సమయంలో నాణ్యత.. తూకం..ధర తదితర అంశాల్లో పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు.



### రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి..

మార్కెట్కు వచ్చే రైతులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు యార్డును పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆ మె ఆదేశించారు.రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆమె సూచించారు. వ్యవసాయ మార్కెట్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఆదాయ వనరులను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు.

### పామాయిల్ నాణ్యత పై అధికారుల పరిశీలన..

అదే విధంగా వ్యవసాయ మార్కెట్ ప్రాంగ ణంలో రైతులు విక్రయానికి తీసుకు వచ్చిన పామాయిల్ గెలలను ఆమె పరిశీలిం చారు. మార్కెట్ యార్డులో.. పామాయిల్ గెలల విక్రయాలు..నాణ్యత తదితర అంశాలను ఆమె పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసు కున్నారు. మార్కెట్కు వచ్చే పామాయిల్ గెలల నాణ్యత పరిశీ లించి.. రైతు లకు పారదర్శకంగా మార్కెటింగ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. మార్కె ట్ కు తీసు కువచ్చే సమయంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆమె తెలిపారు. మార్కెట్ ప్రాంగణంలో రై తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు .ఈ తనిఖీలో ఖమ్మం, భద్రాద్రి.. కొత్తగూడెం జిల్లాల డీఎంఓలు సతీష్ కుమార్, యం.డి.అలీమ్,ఖమ్మం అసిస్టెంట్ సెక్రటరీ ఆంజనేయులు,వైరా..ఏన్కూరు మార్కెట్ సెక్రటరీలు వాసాల వెంకటేశ్వరరావు,నిర్మల,సూపర్వైజర్ అనూషతో పాటు మార్కెట్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ బిడ్డకు..ఓయూ డాక్టరేట్ కిరీటం.

.ఏన్కూరు,సెప్టెంబర్ 10, ప్రభాత వార్త :

నిరుపేద ఆదివాసి కుటుంబం నుంచి వచ్చిన ఓ యువకుడు కష్టాలను..మెట్లుగా మలుచుకొని ఉన్నత విద్యలో త న సత్తా చాటారు.ఎన్నోఅవమానాలు..అవహేళనలు..ఆకలి బాధలను అధికమించి లక్ష్యాన్ని చేరుకున్నారు.ఉస్మా నియా విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డీ. డాక్టరేట్ అందుకొని కేసు పల్లి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు.ఉ స్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవంలో ఖమ్మం జిల్లా..ఏన్కూరు మండల పరిధిలోని కేసుపల్లి గ్రామా నికి చెందిన సాగబోయిన పాపారావు పీ.హెచ్.డీ. డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు.హైదరాబాద్‌లోని ఉస్మానియా వి శ్వ విద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్..యూని వర్సిటీ ఛాన్సలర్ శివ ప్రతాప్ శుక్ల హాజరుకాగా..భారత్ బయోటెక్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కృష్ణ..యం.ఇల్లా ము ఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఓయూ వైస్ ఛాన్సలర్ ములుగారం కుమార్‌తో కలిసి పరిశోధన పూర్తి చేసిన విద్యార్థుల కు పీ.హెచ్.డీ.డిగ్రీలను ప్రదానం చేశారు.ఖమ్మం జిల్లా..ఏన్కూరు మండల పరిధిలోని కేసుపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు సాగబోయిన కమలమ్మ..పుల్లయ్య దంపతుల మూడో సంతానమైన పాపారావు ఉస్మానియా విశ్వ వి ద్యాలయం సోషియాలజీ విభాగంలో "సబ్ ప్లాన్ అండ్ ట్రైబల్ డెవలప్‌మెంట్..ఏ సోషియాలజికల్ స్టడీ ఆఫ్ ఐటీ డీఏ భద్రాచలం తెలంగాణ" అనే అంశంపై పరిశోధన చేపట్టి తన పరిశోధనా పత్రాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పిం చారు.పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసిన ఆయనకు





స్నాతకోత్సవంలో డాక్టరేట్ డిగ్రీని అందజేశారు.నిరుపేద కుటుంబం నుంచి డాక్టరేట్ వరకు..ఈ సందర్భంగా డాక్టర్ సాగబోయిన పాపారావు మాట్లాడుతూ..నిరుపేద ఆదివాసీ కుటుంబంలో జన్మించిన తాను ప్రాథమిక విద్యను కేసుపల్లి ప్రభుత్వ పాఠశాలలో అభ్యసించానని తెలిపారు.అనంతరం రామవరం గిరిజన ఆశ్రమ పాఠశాలలో హైస్కూల్ విద్యను..తార్నాక విశ్వచైతన్య జూనియర్ కళాశాలలో సెకండరీ విద్యను పూర్తిచేసినట్లు తె లిపారు.సిటీ కాలేజీలో డిగ్రీ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ..పీ.హెచ్.డీ.విద్యను పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.కష్టాలను అధిగమించి లక్ష్య సాధన..కష్టాలనే మెట్లుగా మార్చుకొని..లక్ష్యసాధనలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నానని ఆయన తెలిపారు.సమస్యలు ఎ న్ని ఎదురైన లక్ష్యాన్ని మాత్రం విడిచిపెట్టలేదని పేర్కొన్నారు.కష్టాలను ఇష్టంగా స్వీకరించి సాగిన ప్రయాణానికి నే డు డాక్టరేట్ రూపంలో గుర్తింపు లభించింది అన్నారు.ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 109 సంవత్సరాల చరిత్ర లో సోషియాలజీ విభాగం నుంచి తొలి ఆదివాసీ పరిశో ధకుడిగా..ఆదివాసీ ప్రజల సామాజిక పరిస్థితులపై అధ్య యనం చేసిన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందడం తనకు ఎంతో గర్వకారణమని

ఎా ఎా ంా వ ్ర

పేర్కొన్నారు.ఈ స్థాయికి చేరుకునే క్రమంలో అనేక కష్టనష్టాలు..ఆకలి బాధ లు..అవమానాలు..అవహేళనలను ఎదుర్కొన్నానని ఆయన తెలిపారు.ఎన్ని సమస్యలు ఎదురైనా లక్ష్య సాధన కోసం వాటిని ధైర్యంగా అధిగమించానని తెలిపారు.అణగారిన వర్గాల సమస్యలపై మరింత అధ్యయనం..తాను సాధించిన జ్ఞానాన్ని..పొందిన అనుభవాన్ని భవిష్యత్తులో సమాజంలోని అణగారిన వర్గాలు ఎదుర్కొంటు న్న సమస్యలపై లోతైన అధ్యయనం..అవగాహన కోసం వినియోగిస్తానని డాక్టర్ పాపారావు తెలిపారు..ఉస్మాని యా విశ్వవిద్యాలయం అందించిన పీ.హెచ్.డీ.డాక్టరేట్ డిగ్రీని తనకు జన్మనిచ్చి ఈ ప్రపంచానికి పరిచయం చేసిన తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.తన జీవిత ప్రయాణంలో వెన్నుతట్టి ప్రోత్సహించిన తల్లిదండ్రు లు..విద్యాబుద్ధులు నేర్పిన గురువులు..కుటుంబ సభ్యులు..స్నేహితులు.. శ్రేయోభిలాషులకు పాదాభివందనాలు తెలియజేస్తున్నట్లు డాక్టర్ పాపారావు అన్నారు.

## ఘనంగా మండల స్థాయి క్రీడా పోటీలు



అశ్వాపురం,ప్రభాతవార్త సెప్టెంబర్ 10

అశ్వాపురం మండల పరిధిలోని మల్లెలమడుగు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు. క్రీడా పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన మండల ఎంపీడీవో ముత్యాలరావు ప్రారంభించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావనను పెంచేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం గ్రేటర్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. విజేతలను అభినందిస్తూ మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మల్లెలమడుగు గ్రామ సర్పంచ్ మచ్చ నరసింహారావు, ఉప సర్పంచ్ గాడిద మహేష్, ఎంఈఓ వీరస్వామి, లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం గ్రేటర్ అధ్యక్షుడు సింగం శ్రీధర్, సభ్యులు బత్తుల కృష్ణమూర్తి, సురకంటి దినేష్ రెడ్డి, కమటం భరత్, బద్ది సందీప్, పాటి ప్రదీప్ రెడ్డి, వివిధ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాద కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలి

**ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే మతోన్మాద రాజకీయాలు**

**ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**

**వర్క్‌షాప్‌లో పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు**

వైరా టౌన్ సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త)

సామ్రాజ్యవాద శక్తుల ఆధిపత్యం, మతోన్మాద రాజకీయాలు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు దేశ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. అదే విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ప్రజల సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తూ ప్రత్యామ్నాయ ప్రజా విధానాల కోసం ప్రజలను సమీకరించాలని పిలుపునిచ్చారు. వైరా మిట్టపల్లి గార్డెన్స్‌లో సీపీఐ(ఎం) వైరా డివిజన్ వర్క్‌షాప్ సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను విశ్లేషించారు.సామ్రాజ్యవాద ఆధిపత్యంతో ప్రపంచంలో సంక్షోభాలుప్రపంచ ఆర్థిక వ్యవస్థపై సామ్రాజ్యవాద దేశాలు, బహుళజాతి సంస్థల ఆధిపత్యం పెరుగుతున్న కొద్దీ ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, యుద్ధాలు, ఆహార సంక్షోభాలు తీవ్రతరం అవుతున్నాయని నాయకులు అన్నారు. ప్రపంచంలోని సహజ వనరులు, మార్కెట్లు, చౌకైన శ్రమపై ఆధిపత్యం కోసం సామ్రాజ్యవాద శక్తులు పోటీ పడుతున్నాయని, దీని ఫలితంగా అనేక దేశాలు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. యుద్ధాలు సామాన్య ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నప్పటికీ ఆయుధాల వ్యాపారం ద్వారా భారీ లాభాలు ఆర్జిస్తున్న కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వడం దుర్మార్గమన్నారు. భారతదేశం కూడా ఈ విధానాల ప్రభావానికి గురవుతోందని, దేశ సంపద కొద్దిమంది కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతోందని విమర్శించారు. మతోన్మాదం



ప్రజల ఐక్యతకు ప్రమాదకరందేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలపై చర్చ జరగకుండా ప్రజలను మతం పేరుతో విభజించేందుకు మతోన్మాద రాజకీయాలను ఉపయోగిస్తున్నారని నాయకులు విమర్శించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, కార్మికుల వేతనాలు, మహిళలపై హింస, విద్యా-వైద్య రంగాల సమస్యలు వంటి ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను నిలదీయాల్సిన సమయంలో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని అన్నారు. భారత రాజ్యాంగంలోని లౌకిక, ప్రజాస్వామ్య విలువలను



కాపాడుకోవడం కోసం ప్రజలంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ విధానాలు కార్పొరేట్‌లకు అనుకూలంకేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు సామాన్య ప్రజలకు కాకుండా కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉన్నాయని నాయకులు ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, కార్మికుల హక్కులను బలహీనపరిచే విధానాలు తీసుకురావడం, రైతాంగ సమస్యలను నిర్లక్ష్యం చేయడం, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో విఫలం కావడం వల్ల ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల జీవనం భారంగా మారిందని తెలిపారు. దేశ సంపదను కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించే విధానాలను తిప్పికొట్టాలని అన్నారు.ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలంతెలంగాణ ప్రజలకు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలు, రైతులు, యువత, నిరుద్యోగులు, పేదలు, విద్యార్థులు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలను కేవలం రాజకీయ ప్రచారానికి పరిమితం చేయకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని అన్నారు. పేదలకు ఇండ్లు, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని, హామీల అమలు కోసం ప్రజలు ప్రశ్నించే హక్కును ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు.ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలికేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం స్థానిక స్థాయిలో ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతాంగ సమస్యలు, కార్మికుల కనీస వేతనాలు, మహిళల సమస్యలు, ప్రభుత్వ విద్య, ప్రభుత్వ వైద్యం, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ప్రజా సమస్యలను కేంద్రంగా చేసుకుని నిరంతర పోరాటాలు నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ(ఎం) పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, మోదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, దుగ్గి కృష్ణ, కొండెబోయిన నాగేశ్వరరావు, వైరా డివిజన్ నాయకులు దొంతెబోయిన నాగేశ్వరరావు, మచ్చా మణి, చెరుకుమల్లి కుటుంబరావు, కుందనపు నరేంద్ర, తూము సుధాకర్, కొణిదెణ కోటేశ్వరరావు, షేక్ జమాల్ సాహెబ్, పార్టీ డివిజన్, మండల, పట్టణ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షూ, యూనిఫాం పంపిణి



కారేపల్లి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని సింగరేణి ప్రాథమిక పాఠశాలవిద్యార్థులకు షూ, యూనిఫాం దుస్తులను సింగరేణిసర్పంచ్ మేదర వీరప్రతాప్ (టోనీ) గురువారం పంపిణి చేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం విద్యారులకు అందజేసిన దుస్తులను సర్పంచ్ అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని పాఠశాలలో సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల చదువుల విషయంలో పేద కుటుంబాలకు ఎలాంటి అర్థిక ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, షూలు అందించటమే కాక అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందిస్తూ ప్రోత్సహిస్తుందన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వమన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో పాఠశాలల అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ఎండీ.జాకీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో డీజేలకు పూర్తిగా నిషేధం..

ముదిగొండ, ప్రభాతవార్త:



డీజే యజమానులు, గణేష్ మండపాల నిర్వాహకులతో గురువారం అవగాహన నిర్వహించారు. వినాయక విగ్రహాల ఏర్పాటు, మండపాల నిర్వహణ, నిమజ్జనం తదితర అంశాలపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ముందుగానే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తప్పనిసరిగా అనుమతి పొందాలని సీఐ మురళి సూచించారు. మండపాల వద్ద నిర్వహించే కార్యక్రమాలకు నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలను ఏర్పాటు చేయడం పూర్తిగా నిషిద్ధమని తెలిపారు.విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు పోలీసులకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సీఐ మురళి సూచించారు

## తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

బోనకల్, ప్రభాతవార్త :

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరుతూ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఈ నెల 11న




చిరునీముల లో తామ్రపత్ర గ్రహీత, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావెళ్ల జానకిరామయ్య స్థూపం వద్ద తెలంగాణ కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జక్కుల రామారావు పూలమాలలు వేసి వారోత్సవాలను ఘనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన యోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భూస్వామ్య, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. పోరాట యోధుల త్యాగాలు, ఉద్యమ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాల్లో సిపిఐ గ్రామ శాఖల కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, ఏఐకేఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు, శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలను విద్యుత్ బిల్లును ఎత్తివేయాలి

### 28న జరుగు బహిరంగ సభను విజయవంతం చేయండి

కారేపల్లి సెప్టెంబర్ 10 ప్రభాతవార్త



కార్మికుల హక్కులను కాలరాచే నాలుగు చట్టాలను కేంద్రం తక్షణమే ఎత్తివేయడంతోపాటు విద్యుత్ బిల్లును ఉపసంహరించాలని ఏఐకేఎంఎస్ కార్యదర్శి వై ప్రకాష్ డిమాండ్ చేశారు.ఈనెల 28న ఖమ్మంలో జరుగు భారీ బహిరంగ సభ 29 ,30 తేదీలలో జరుగు అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్లను మండలం మాదారం గ్రామంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల మూలంగా నేడు దేశంలో రైతాంగం పరిస్థితి తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు 2022 వరకు రైతుల యొక్క ఆదాయాన్ని రెట్టింపు చేసి రైతును రాజు చేస్తానన్న ప్రభుత్వాలు చేసిన వాగ్దానాలు తుంగలో తొక్కి వేసినారని విమర్శించారు. కేంద్రం తీసుకువచ్చిన రైతు కార్మిక వ్యతిరేకమూడు నల్ల చట్టాలను నాలుగు లేబర్ కోడులను విద్యుత్ బిల్లునుఎత్తివేయాలని లక్షలాదిమందితో ఢిల్లీ సరిహద్దులలో 750 మంది అమరులైన ఫలితంగా మోడీ ప్రభుత్వం దిగివచ్చి వాటిని రద్దు చేస్తానని అన్నట్లు తెలిపారు. రైతాంగం పండించిన అన్ని రకాల పంటలకు ఎం ఎస్ పి గిట్టుబాటు ధర స్వామినాథన్ సిఫారస్లను కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తానని ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి లిఖితపూర్వకంగా వ్రాసి ఇచ్చి వాటిని అమలు చేయకుండా రైతాంగానికి తీవ్ర ద్రోహం చేసినారని విమర్శించారు వీటన్నిటికీ వ్యతిరేకంగా రైతు కూలీలను ఐక్యం చేసి రైతాంగ పోరాటాలను ముందుకు తీసుకుపోయే విధంగా ఈ మహాసభలలో భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకొని ముందుకు తీసుకు వెళుతుందని ఈనెల 28 ఖమ్మంలో జరిగే బహిరంగ సభను 29 30 తేదీలలో జరుగు మహాసభలను అన్ని వర్గాల ప్రజలు రైతులు కూలీలు కార్మికులు విద్యార్థి మేధావులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా మండల నాయకులు కోయిల శ్రీనివాస్ కావేటి నాగేశ్వరరావు గద్దం వెంకన్న నరేష్ నరసింహారావు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం: ఆర్‌జెడి

ఏన్కూరు,సెప్టెంబర్ 10, ప్రభాతవార్త





:విద్యార్థుల సమగ్ర అభివృద్ధితో పాటు..క్రమశిక్షణ..వ్యక్తిత్వ వికాసానికి ఉపాధ్యాయులు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పాఠశాలల విద్యాశాఖ ప్రత్యేక పరిశీలకులు..ఆర్ జేడీ మదనమోహన్ పేర్కొన్నారు.మండల కేంద్రమైన ఏన్కూరు లోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలుర పాఠశాల..కళాశాలను జిల్లా పాఠశాలల విద్యాశాఖ ప్రత్యేక పరిశీలకు లు..ఆర్ జేడీ మదన్‌మోహన్ గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను..విద్యార్థులకు అందుతున్న విద్యా సదుపాయాలను ఆయన పరిశీలించారు.పాఠశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి పలు వివరాలను ప్రధానోపాధ్యాయుడును అడిగి తెలుసుకున్నారు.పీఎం శ్రీ పథకం ద్వారా చేపడుతున్న కార్యక్ర మాలు..వాటి పని తీరును పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థుల్లో సృజనాత్మకత..శాస్త్రీయ ఆ లోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ఆయన స్వయంగా పరిశీలిం చారు.అలాగే ఫిజిక్స్ వాలా..ఖాన్ అకాడమీ ద్వారా విద్యార్థులకు అందుతున్న ఆన్‌లైన్ విద్యా సదుపాయాలపై ఆ రా తీశారు.పాఠశాల లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వివరాలను కూడా ఆయన పరిశీలించారు.గత విద్యా సంవత్స రంలో పదో తరగతి..ఇంటర్మీడియట్‌లో సాధించిన ఫలితాల గురించి పాఠశాల ప్రిన్సిపాల్ వేము రాజును అడిగి తె లుసుకున్నారు.విద్యా ర్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ..నైపుణ్యాభివృద్ధి..సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు..ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయ న పేర్కొన్నారు.పాఠశాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూ డాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ఆర్ జేడీ మదనమోహన్ మాట్లాడుతూ..విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు..వారిలో సృజనాత్మకత..శాస్త్రీయ దృక్పథం..నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉ పాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు.పీఎం శ్రీ పథకం..అటల్ టింకరింగ్ ల్యాబ్..ఫిజిక్స్ వాలా..ఖా న్ అకాడమీ వంటి ఆధునిక విద్యా సదుపాయాలను విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూ డాలని ఆయన అన్నారు.విద్యార్థుల విద్యా ప్రమాణాలను..ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పదో తరగతి..ఇంటర్మీడియ ట్ ఫలితాలను మరింత మెరుగు పరిచేందుకు ప్రత్యేక కార్యా చరణతో ముందుకు సాగాలని ఆయన సూచించా రు.ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి..వారి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహం అందించాలని ఆయన తెలిపా రు.ఈ కార్యక్రమంలో సీసీ మాధవరావు,ఎఫ్ఏఓ శాంసన్,పాఠశాల ప్రిన్సిపాల్ వేము రాజు,ఏటీపీ శ్రీనివాస్,ఉపా ధ్యాయులు,సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

కామేపల్లి, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:



బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ధరావత్ సోంలాల్ పిలుపు నిచ్చారు.కామేపల్లి మండల ప్రజా పరిషత్ కా ర్యాలయంలో గురువారం ఏఐడీ జే ఆర్ సి సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన పై ని ర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసం గించారు.గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలనకు పంచాయతీ కార్యదర్శులు తగు చర్యలు తీసుకో వాలని కోరారు.గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చే యాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ఏ ఐ డి జే ఆర్ సి సంస్థ సోషల్ మొబలైజర్ జర్పుల రవీందర్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో గత మూడు సంవత్సరాల నుండి బాల్య వివాహాల నిర్మూలన కొరకు సంస్థ డైరెక్టర్ పి ఎస్ ఎస్ హరిప్రసాదరావు, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు సారధ్యంలో కృషి చేస్తున్నట్లు వివరించారు. లక్ష్యసాధన కొరకు గ్రామస్థాయి నుంచి బలమైన వ్యవస్థ నిర్మాణం జిల్లా స్థాయి వరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అందులో భాగంగా ప్రభుత్వ శాఖలతో సమర్థవంతమైన సమన్వ యం, బాలల హక్కుల పరిరక్షణ కొరకు విస్తృ తకార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నట్టు వెల్లడించారు.ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పా ల్గొన్నారు.అనంతరం కొమ్మినేపల్లి గ్రామ పంచా యతీ కార్యాలయంలో కూడా సమావేశం నిర్వ హించారు.ప్రచార సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి. శంకర్, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఏర్పాట్లపై అధికారుల సమావేశం

**కల్లూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**



తహశీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో వినాయక చవితికి విగ్రహాల ఏర్పాట్లు అక్కడి పరిసరాలలో తీసుకోవలసిన శానిటేషన్ పనులు, కరెంట్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో కరెంటు ఏఈ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డీజే వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతుల విషయంలో ఎస్సై తీసుకోవలసిన చర్యలు, నిమజ్జనం రోజు చెరువు దగ్గర పరిస్థితుల గురించి ఇరిగేషన్ ఏఈ లైటింగ్ ఏర్పాటు గురించి మున్సిపాలిటీ తరఫున మేనేజర్ కి చర్యల గురించి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేసి వివరాలను తెలిపారు. ఈ సమావేశంలో తాసిల్దార్, ఎంపీడీవో, ఎంసీ మేనేజర్ , కరెంట్ ఏఈ, ఇరిగేషన్ ఏఈ , ఎస్సై, ఏపిఎం, మెడికల్ డిపార్ట్మెంట్ సిబ్బంది, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఖమ్మం జిల్లా ఖోఖో బాలికల జట్టు ఎంపిక

**కల్లూరు, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త**



కల్లూరు మినీ స్టేడియంలో ఖమ్మం జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఖేలో ఇండియా' జిల్లా స్థాయి ఎంపిక పోటీలు గురువారం బాలికల విభాగంతో ముగిశాయి. మొత్తం 101 మంది క్రీడాకారిణులు పాల్గొనగా, 26 మంది పీడీలు, పీఈటీల సమక్షంలో నిర్వహించిన ఎంపికల్లో 12 మందితో కూడిన జిల్లా జట్టును ప్రకటించారు. ఈ జట్టు ఈ నెల 17న హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఖమ్మం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనుంది.ఎంపికైన క్రీడాకారిణులు...గొంది మోనిక, జమిలి రవళిక, గండు రాధిక, గోనే శ్రావణి, కడారి భవాని, దారవత్ ప్రవళిక, ఊకే మాధవి, కారం సమ్మక్క, పమ్మి వెంకటలక్ష్మి ్మ, శీలం తేజశ్రీ, మోకాళ్ళ కావ్య, షైక్ సాధిక.క్రీడాకారిణులకు టీఎస్ఐడీసీ చైర్మన్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మువ్వా విజయ్ బాబు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాటేపల్లి కిరణ్, మట్టూరి జనార్దన్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసుపులేటి వీరరాఘవయ్య, ప్రతినిధులు పి. నరసయ్య, ఎస్. రామారావు, ఎస్. ప్రసాద్, బి. భీమా పి. సతీష్ కుమార్ కె. తులసి జి. రమాదేవి సిహెచ్. త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

## వరి సన్నాల బోనస్ నమోదుకు సెప్టెంబర్ 17వరకు అవకాశం

**-మండల వ్యవసాయ అధికారి కే.రాజు**

**బయ్యారం,ప్రభాతవార్త,సెప్టెంబర్10:**

ప్రభుత్వం ప్రకటించిన 7రకాల సన్న వరి ధాన్యానికి రూ.500 బోనస్ పొందేందుకు ఆన్‌లైన్ నమోదు గడువును సెప్టెంబర్ 17వ తేదీ వరకు పొడిగించినట్లు బయ్యారం వ్యవసాయ అధికారి కే.రాజు తెలిపారు.సన్న వరి సాగు చేసిన రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రైతులు తమ ఆధార్ కార్డు,పట్టాదార్ పాస్ పుస్తకం,పంట సాగు వివరాలు,విత్తనాల రసీదుతో దగ్గరలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించాలన్నారు.ఫర్టిలైజర్ షాపులో విత్తనాలు కొనుగోలు చేస్తే ఆ షాప్ లోనే ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని,కాబట్టి అర్హులైన రైతులందరూ సెప్టెంబర్ 17 లోపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఏఓ స్పష్టం చేశారు.

# శిరీషకు ఘన నివాళులు

**కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే జారే..**

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి: మాజీ ఎమ్మెల్యే తాటి..**

**న్యాయం కోసం పాదయాత్ర చుంచు రామకృష్ణ**



**ములకలపల్లి, సెప్టెంబర్ 10, ప్రభాతవార్త:**

హైదరాబాద్‌లోని ప్రైమ్ కేర్ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తూ దారుణ హత్యకు గురైన ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీషకు గురువారం నిర్వహించిన సంతాప సభలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శిరీష చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**ప్రభుత్వం అండగా ఉంటుంది**

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ శిరీష కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, కుటుంబంలో ఒకరికి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఐదు ఎకరాల భూమి అందజేస్తామని తెలిపారు. శిరీష ఘటనపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోందని, దోషిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ప్రభుత్వం స్పందించాలి**

అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శిరీష హత్య జరిగి 14 రోజులు గడిచినా బాధిత కుటుంబానికి ఆశించిన స్థాయిలో న్యాయం అందకపోవడం బాధాకరమన్నారు. ఇద్దరు మంత్రులు కుటుంబాన్ని పరామర్శించడం మినహా ప్రభుత్వం నుంచి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై విచారణను వేగవంతం చేసి నిందితుడికి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**న్యాయం జరిగే వరకు పోరాటం**

జనసేన రాష్ట్ర నాయకుడు, సినీ నటుడు అల్లాడి తనీష్ మాట్లాడుతూ శిరీష కుటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే జనసేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

**న్యాయం కోసం పాదయాత్ర**

ఆదివాసీ 9 తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ మాట్లాడుతూ మహబూబాబాద్ పాకలకొత్తగూడ లో మొదలైన పాదయాత్ర దాదాపు 110 కిలో మీటర్లు దాటి శిరీష కుటుంబానికి అండగా ఉండి న్యాయం కోసం పోరాడుతూ పాదయాత్ర చేయడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల నుంచి ఆడపిల్లలను చదువు, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు పంపే తల్లిదండ్రులకు భద్రతపై ప్రభుత్వం భరోసా కల్పించాలని కోరారు.

**రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి**

ఆదివాసీ నాయకులు సోయం వీరభద్రం, వాసం రామకృష్ణ మాట్లాడుతూ శిరీష కుటుంబానికి రూ కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి కానీ ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారంతో సరిపెట్టుకుందని విమర్శించారు.అలాగే బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంతాప సభలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, దమ్మపేట మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వర్లు, ములకలపల్లి మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామస్థులు పాల్గొని శిరీషకు నివాళులర్పించారు.

# గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

**నిర్వాహకులకు కఠిన సూచనలు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే అనుమతులు రద్దు**




**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 10 ప్రభాతవార్త:**

గణేష్ ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలు, ప్రజా భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ సూచించారు. గురువారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేష్ విగ్రహాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన, మండపం ఏర్పాటుకు ముందుగా పోలీసు, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనుమతి పొందిన ప్రదేశంలోనే విగ్రహం, మండపాన్ని ఏర్పాటు చేయాలని, రహదారులు, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలు, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది కలిగించకూడదని స్పష్టం చేశారు. అనుమతి దరఖాస్తులో పేర్కొన్న పరిమాణాలకు మించి విగ్రహం, మండపం ఎత్తు పెంచరాదని సూచించారు. విద్యుత్ కనెక్షన్లకు సంబంధిత అనుమతులు తీసుకోవడంతో పాటు నిపుణుల చేత సురక్షి తంగా వైరింగ్ చేయించాలని చెప్పారు. మండపాల్లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలని, అత్యవసర వాహనాలు వెళ్లేందుకు మార్గం ఖాళీగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చూడాలని, జనసందోహాన్ని నియంత్రించేందుకు బాధ్యతాయుతమైన వాలంటీర్లను నియమించుకోవాలని సూచించారు. సౌండ్ సిస్టమ్‌కు అనుమతి తప్పనిసరని, నిర్ణీత సమయాల్లో, అనుమతించిన శబ్ద పరిమితుల్లోనే వినియోగించాలని తెలిపారు. గణేష్ నిమజ్జన ఊరేగింపు అనుమతించిన మార్గం, తేదీలోనే నిర్వహించాలని, మార్గం లేదా సమయాన్ని మార్చాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. నిమజ్జనం కూడా అధికారులు నిర్దేశించిన ప్రదేశంలోనే నిర్వహించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా జూదం, మద్యం లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగం, పంపిణీ, ఆయుధాల ప్రదర్శన, రెచ్చగొట్టే నినాదాలు, విద్వేషపూరిత ప్రసంగాలు, మత సామరస్యానికి భంగం కలిగించే చర్యలను పూర్తిగా నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎవరైనా తప్పిపోయినా లేదా అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండపం పరిసరాల్లో పరిశుభ్రత పాటించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ఉత్సవ ప్రాంగణం, నిమజ్జన ఊరేగింపు సమయంలో శాంతిభద్రతలు, ప్రజా భద్రత, క్రమశిక్షణకు నిర్వాహకులే బాధ్యత వహించాలని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఇచ్చిన అనుమతులను రద్దు చేయడంతో పాటు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# స్కూల్ గేమ్స్‌లో ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

**-జోనల్ స్థాయికి ఎంపిక**

**బయ్యారం,ప్రభాతవార్త,సెప్టెంబర్ 10:**

బయ్యారం మండల స్థాయిలో ఈ నెల 7,8 తేదీలలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో ఇర్సులాపురం ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి మహబూబాబాద్ జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్ జూనియర్,సీనియర్ విభాగాల్లో పాఠశాల జట్లు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఖోఖో జూనియర్ విభాగం నుండి నలుగురు, సీనియర్ విభాగం నుండి ముగ్గురు విద్యార్థులు జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. కబడ్డీ సీనియర్ విభాగం నుండి ముగ్గురు విద్యార్థులు జోనల్‌కు ఎంపికయ్యారు. పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన విజేతలను,వారికి శిక్షణనిచ్చిన పిడి వాలు ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు,ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. జోనల్ స్థాయిలో కూడా ప్రతిభ చూపి పాఠశాలకు మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆకాంక్షి ంచారు.

## పోడు సాగు చేసుకుంటున్న గిరిజనేతరులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలి

**కరెంట్, బోర్లకు అనుమతులు కల్పించాలి**

**- సీపీఐ(ఎం) రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి**

**రఘునాథపాలెం, ప్రభాతవార్త సెప్టెంబర్ 10:**



మండలంలోని గణేశ్వరం, చింతగుర్తి, దొనబండ, మల్లేపల్లి, పంగిడి, ఈర్లపూడి తదితర గ్రామాల్లో అనేకమంది పేద గిరిజనేతరులు భూములను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని సీపీఐ(ఎం) రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్. నవీన్ రెడ్డి తెలిపారు. అయితే వారికి హక్కు పత్రాలు లేకపోవడంతో వ్యవసాయం చేసుకోవడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఈరోజు రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పోడు సాగుదారుల గ్రీవెన్స్ డే కార్యక్రమంలో సీపీఎం రఘునాథపాలెం మండల కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఏపీడీ డేవిడ్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్. నవీన్ రెడ్డి మాట్లాడుతూ, పోడు సాగు చేసుకుంటున్న గిరిజనేతర పేద రైతులందరికీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని, ఇప్పటికే హక్కు పత్రాలు పొందిన రైతులకు వ్యవసాయానికి అవసరమైన కరెంట్ సౌకర్యం కల్పించాలని, బోర్లు వేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హక్కు పత్రాలు లేకపోవడం వల్ల పంట రుణాలు, విద్యుత్ సౌకర్యం, వ్యవసాయ బోర్లు తదితర అంశాల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటను మార్కెట్‌లో విక్రయించే సమయంలో కూడా హక్కు పత్రాలు అడుగుతున్నారని, దీనివల్ల పేద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం వెంటనే అర్హులైన పోడు సాగుదారులందరికీ హక్కు పత్రాలు అందించి, వారికి వ్యవసాయానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎస్. నవీన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు వల్లూరి శ్రీనివాసరావు, గూగులోత్ కుమార్, కూచిపూడి నరేష్, కే. నవీన్ కుమార్, నాయకులు కృష్ణయ్య, మల్లయ్య, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపిల్లల ఉచిత గుండె చికిత్సా శిబిరం విజయవంతం

**డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు**

**ఖమ్మం వైద్య విభాగం, సెప్టెంబర్ 10 (ప్రభాతవార్త )**

తెలంగాణ ప్రభుత్వ వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు, ఖమ్మం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎన్. వేణు మాధవరావు, ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా ప్రధాన జనరల్ ఆసుపత్రి లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం మరియు హైదరాబాద్ అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ !! రీసెర్చ్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఉచిత చిన్నపిల్లల గుండె చికిత్సా శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరానికి 0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల మొత్తం 62 మంది పిల్లలు హాజరయ్యారు. వీరిలో ఖమ్మం జిల్లాకు చెందినవారు 61 మంది కాగా, మహబూబాబాద్ జిల్లా నుండి ఒకరు హాజరయ్యారు. నిపుణులైన వైద్య బృందం చిన్నారులను క్షుణ్ణంగా పరీక్షి ంచి వర్గీకరించారు 3 మేజర్ సర్జరీ అవసరమైన కేసులు, 11 మైనర్ సర్జరీ అవసరమైన కేసులు, 4 రీఅసెస్మెంట్ కేసులు, 5 మెడికల్ మేనేజ్మెంట్, 16 పీరియాడికల్ రివ్యూ (ప్రతి 6 నెలలకోసారి పరీక్షలు అవసరమైనవారు) 23చిన్నారులు సాధారణ స్థితిలో ఉన్నవారుగా గుర్తించారు....ఉచితంగా గుండె ఆపరేషన్లు...ఈ క్యాంపులో గుండె ఆపరేషన్ అవసరమని గుర్తించిన చిన్నారుల తల్లిదండ్రులు తమ వెంట రేషన్ కార్డు, ఆధార్ కార్డు మరియు తాజా ఆదాయ ధృవీకరణ పత్రం తీసుకొని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో మెడికల్ కాలేజీ ఆసుపత్రిని సంప్రదిస్తే, అక్కడ వారికి పూర్తిగా ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించబడతాయని అధికారులు తెలిపారు. పాల్గొన్న వైద్యులు !! సిబ్బంది: ఈ వైద్య శిబిరంలో హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సుజాతా పాటిల్, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్, డాక్టర్ సునీల్ కుమార్ స్వైన్, పీడియాట్రిక్ కార్డియోసిక్ సర్జన్ డాక్టర్ అనుపమ పాటేల్, సీనియర్ సర్జికల్ కార్డియాలజిస్ట్ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఖమ్మం జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, పీడియాట్రిక్స్ హెచ్ఓడీ డాక్టర్ బాబు రత్నాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి లక్షి ్మ నారాయణ, నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, మరియు డాక్టర్లు ప్రకాష్, రవి, ప్రవీణ్ కుమార్, సతీష్, అరుణ, శిరీష, ఉదయలక్షి ్మ, సుచిత్ర, అమూల్య, మాధవి, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 22ఏ భూములపై ఖమ్మంలో బీజేపీ సమరశంఖం

**పేద, మధ్యతరగతి రైతుల భూములకు విముక్తి ఎప్పుడు?**

**మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి.**

**రికార్డుల్లో ఒకలా.. నిషేధిత జాబితాలో మరోలా**

**బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.**

**కలెక్టరేట్ ధర్నా చౌక్ దగ్గర బిజెపి మహాధర్నా..**

**జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పణ.**



**ఖమ్మం కలెక్టరేట్ సెప్టెంబర్ 10: (ప్రభాతవార్త)**

రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర రాజకీయ చర్చకు దారితీసిన 22 ఏ నిషేధిత ఆస్తుల జాబితా వ్యవహారంపై ఖమ్మంలో భారతీయ జనతా పార్టీ సమరశంఖం పూరించింది. దశాబ్దాలుగా తమ భూములను అనుభవిస్తున్నప్పటికీ 22ఏ జాబితాలో చేర్చడంతో వాటిని విక్రయించుకోలేక, రిజిస్ట్రేషన్ చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న రైతులు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తామని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. ఖమ్మం కలెక్టరేట్ సమీపంలోని ధర్నాచౌక్‌లో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, 22ఏ బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖను పర్యవేక్షి స్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమస్య పరిష్కారంలో చొరవ చూపడం లేదని ఆరోపిస్తూ ఆయన రాజీనామా చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో భారతీయ జనతా పార్టీ ఎన్నటికీ వెనకడుగు వేయదు. అవసరమైతే ప్రభుత్వ మెడలు వంచైనా సరే 22ఏ జాబితాలో అకారణంగా చేర్చిన భూములను తొలగింపజేసి తీరుతాం అని హెచ్చరించారు. ఏళ్ల తరబడి తమ భూములపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు వాటిని అవసరమైన సమయంలో అమ్ముకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత విద్య, వైద్య చికిత్స వంటి అత్యవసర అవసరాలకు డబ్బు సమకూర్చుకోవడానికి సొంత భూమిని విక్రయించాలనుకున్నా 22ఏ నిషేధిత జాబితా అడ్డంకిగా మారుతోందని కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. భూమి ఉన్నా దాన్ని అవసరమైన సమయంలో ఆస్తిగా ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని, ఇలాంటి కుటుంబాల బాధలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వాల తప్పిదాలను సరిదిద్దుతామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పుడు ప్రజల భూ సమస్యలను గాలికొదిలేసింది అని ఆయన విమర్శించారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ శాఖను పర్యవేక్షి స్తున్నప్పటికీ సొంత జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 22ఏ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. బాధితుల పక్షాన నిలబడలేని మంత్రి పదవిలో కొనసాగడానికి నైతిక హక్కు లేదని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు**

22 ఏ భూముల అంశం ప్రస్తుతం ఖమ్మానికి మాత్రమే పరిమితమైన సమస్యగా కాకుండా రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపుతోంది. సెప్టెంబర్ 7న ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే బీజేపీ ఎమ్మెల్యేలు 22 ఏ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. ప్రభుత్వం మాత్రం ఈ అంశంపై చర్చకు సిద్ధంగా ఉందని తెలిపింది. బీఆర్ఎస్ కూడా 22 ఏ జాబితాపై న్యాయ విచారణ, శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. తెలంగాణవ్యాప్తంగా నిషేధిత జాబితాలో భూముల చేర్పుపై అనేక ఆరోపణలు వస్తున్నాయని, భూ యజమానుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. అయితే ఇవి రాజకీయ పార్టీల ఆరోపణలేనని, వాటిపై ప్రభుత్వం అధికారికంగా విచారణ లేదా తుది నిర్ధారణ చేయాల్సి ఉంది.

**తప్పులు జరిగాయి.. సరిచేస్తాం:**

ప్రభుత్వంఇదిలా ఉండగా 22 ఏ వ్యవహారంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేశారు. 22 ఏ జాబితాలో భూమి ఉందనే ఒక్క కారణంతో రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించవద్దని, ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టులో ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా కూడా ఆయన ఈ అంశంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టులో మంత్రి పొంగులేటి కొన్ని భూములు పొరపాటున 22 ఏ జాబితాలో చేరినట్లు అంగీకరించి, అటువంటి తప్పులను సరిచేస్తామని వెల్లడించారు. సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు, రికార్డులను ఆన్‌లైన్ లో అందుబాటులోకి తెచ్చి పారదర్శకత పెంచే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీంతో 22 ఏ సమస్యపై ప్రభుత్వం కూడా తప్పుల సవరణకు చర్యలు చేపడుతున్నట్లు స్పష్టమవుతోంది.

**కోర్టుల్లో నూ 22 ఏపై ప్రశ్నలు**

22 ఏ నిషేధిత జాబితాలో ప్రైవేటు భూములు చేర్చడంపై తెలంగాణ హైకోర్టులోనూ పలు కేసులు విచారణకు వచ్చాయి. 2026లో వెలువడిన ఒక తీర్పులో, గతంలో తుది నిర్ణయాలు వెలువడిన భూములను కొత్త ఆధారాలు లేదా మోసం నిర్ధారణ లేకుండా మళ్లీ నిషేధిత జాబితాలో చేర్చడం చట్టపరంగా సమర్థనీయం కాదని కోర్టు పేర్కొంది. కొన్ని సందర్భాల్లో ప్రైవేటు భూములను 22ఏలో చేర్చడంపై అధికారుల చర్యలను హైకోర్టు పరిశీలించింది. ఇటీవల వెలువడిన మరో నివేదికలో రిజిస్ట్రేషన్ రికార్డులు, ప్రభుత్వ భూ రికార్డులు, 22ఏ జాబితాల్లో వ్యత్యాసాలు ఉన్న ఘటనలు వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. కొన్ని చోట్ల ఒక సర్వే నంబరులోని కొంత భూమిపై మాత్రమే వివాదం ఉన్నప్పటికీ మొత్తం సర్వే నంబరును నిషేధిత జాబితాలో చేర్చిన సందర్భాలను కూడా నివేదికలు ప్రస్తావించాయి. ఈ నేపథ్యంలో భూ రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి ధ్రువీకరణ, చట్టపరమైన ప్రక్రియ పాటించడం కీలకంగా మారింది. రైతుల ఆర్థిక ఇబ్బందులే ప్రధాన అంశంభూమి రిజిస్ట్రేషన్ నిలిచిపోవడం కేవలం ఒక రెవెన్యూ సమస్య కాదని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. రైతు కుటుంబానికి భూమి ప్రధాన ఆస్తి. అదే భూమిని అవసరమైన సమయంలో విక్రయించుకోలేకపోతే పిల్లల చదువులు, వివాహాలు, వైద్యం, వ్యవసాయ పెట్టుబడులు వంటి అవసరాలకు ఆర్థిక వనరులు సమకూర్చుకోవడం కష్టమవుతుందని వారు అన్నారు. అందువల్ల 22 ఏ జాబితాలో నిజంగా ప్రభుత్వ ప్రయోజనాలను రక్షి ంచాల్సిన భూములను కొనసాగిస్తూనే, తప్పుగా లేదా అనవసరంగా చేర్చిన భూములను వేగంగా పరిశీలించి తొలగించాలని డిమాండ్ చేశారు. భూమి హక్కులకు సంబంధించిన వివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపడుతున్న భూ రికార్డుల పరిశీలన, భూ భారతి విధానాలు, రీసర్వే ప్రక్రియలు కూడా ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రెవెన్యూ శాఖ ఇప్పటికే 22 ఏ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఉపశమనం కల్పించాలని అధికారులను ఆదేశించింది.

**ఖమ్మం నుంచి రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపు**

22 ఏ బాధితుల సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని నెల్లూరి కోటేశ్వరరావు ప్రకటించారు. ప్రభుత్వానికి బాధిత రైతుల ఆవేదన తెలియజేసేలా మహాధర్నాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 22 ఏ జాబితాపై వివాదం ముదురుతున్న నేపథ్యంలో ఖమ్మంలో బీజేపీ నిర్వహించిన ఈ ఆందోళనకు రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో మాజీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు, వరంగల్ ప్రభారి కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నల్గొండ ప్రభారి సన్నె ఉదయ్ ప్రతాప్, మాజీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధులు నంబూరి రామలింగేశ్వరరావు, వాకదాని పుల్లారావు యాదవ్, మాజీ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రుద్ర ప్రదీప్, రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గుత్తా వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవరావు, ప్రవీణ్, బీజేపీ అభ్యర్థులు నున్నా రవి, విజయరాజు, మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరు రమేష్, భూక్య శ్యాంసుందర్, మమ్మీ అనిత, జ్వాల నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షులు నకరికంటి వీరభద్రం, వీరెల్లి రాజేష్, రవి రాథోడ్, వీరం రాజ్, సుదర్శన్ మిశ్రా, ఏలూరి నాగేశ్వరరావు, మంద సరస్వతి, మనీ, రజిని రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండల అధ్యక్షులు, మోర్చా అధ్యక్షులు, పార్టీ పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.